
అక్కిరెడ్డిపల్లెలో మామిడి చెట్లకు ట్యాంకర్‌తో నీళ్లు పడుతున్న దృశ్యం

కరువు కనిపించలేదా సారూ..?


ములకలచెరువు సమీపంలోని అడవిలో ఎండుముఖం పట్టిన ఊటకుంట

- వర్షం ఎక్కువ పడిందట.. కరువు మండలాలు లేవట..?
- ఎండిన బోర్లు.. చుక్కనీరు లేని చెరువుల మాటేమిటి..?
- వాడిపోతున్న పంటల గోడు వినేదెవరు ?
- ప్రభుత్వ నిర్ణయంతో జిల్లా రైతుల విస్మయం
- కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్

జిల్లాలో ఎక్కడో ఒకటి, రెండు మండలాలు మినహా మిగిలిన అన్ని చోట్లా.. తీవ్ర కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయి. గత మూడేళ్లుగా సరైన వర్షాలు లేక జిల్లా మొత్తం భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో చెరువులు, కుంటల్లో చుక్కనీరు లేక మైదానాలను తలపిస్తున్నాయి. బోర్లలో నీళ్లు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఇప్పటికే సాగైన అరకొర పంటలు ఎండుముఖం పట్టాయి. భూమి మీద పచ్చికే లేక పశువులు మేత కోసం అల్లాడుతున్నాయి. ఎండుటాకులు తింటూ.. ప్రాణాలు నిలుపుకుంటున్నాయి. ఇలాంటి దుస్థితి ఉన్నా ప్రభుత్వం కరువు మండలాల జాబితాలో జిల్లాను చేర్చకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


కలకడ మండలం గంగాపురంలో చుక్కనీరు లేని నేరెళ్లకుంట

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): గతేడాది అక్టోబరులో ప్రభుత్వం జిల్లాలో 19 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. జిల్లాలో 30 మండలాలు ఉండగా.. అందులో 19 కరువు కోరల్లో చిక్కుకోవడం గమనార్హం. అయితే ఈ రబీలో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఆరు జిల్లాల్లో 51 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందే కానీ.. జిల్లాలో కనీసం ఒక మండలానికి కూడా అందులో చోటివ్వలేదు. సాధారణం కంటే.. ఎక్కువ వర్షపాతం నమోదైందనే కారణంతో.. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై జిల్లా రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనా.. సరైన సమయంలో వానలు పడలేదు. దీంతో సాగు కావాల్సిన దాంట్లో.. కనీసం 20 శాతం కూడా పంటలు సాగు కాలేదు. సాగైన పంటలు కూడా ఇప్పుడు ఎండిపోయే ప్రమాదపుటంచుల్లో ఉన్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతున్నారు.

గుర్రంకొండ మండలంలో కరువు తీవ్రంగా ఉంది. మండలంలోని చెరువుల్లోకి గత మూడేళ్లుగా చుక్క నీరు చేరలేదు. కరోనా సమయంలో వర్షాలు రావడంతో.. చెరువులు నిండాయి. అప్పటి నుంచి ప్రతి ఏడాది తుపానులు వచ్చినా.. చెరువులు, కుంటల్లోకి చుక్క నీళ్లు రావడం లేదు. దీంతో భూగర్భజలాలు రోజురోజుకి అడుగంటి పోతున్నాయి గత నెల రోజుల వరకు నీరు వచ్చిన బోర్లు వారం రోజులుగా తగ్గుముఖం పట్టాయి. బోర్లను నమ్ముకుని పంటలు సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

ములకలచెరువు, సంబేపల్లె మండలాల్లో తీవ్ర కరువు రైతులను వెంటాడుతోంది. ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట రైతుకు దిగుబడి రాక నష్టపోయారు. చెరువులు, కుంటలు మైదానాన్ని తలపిస్తున్నాయి. చుక్కనీళ్లు లేవు. బోరుబావులను నమ్ముకుని పంటలను సాగుచేసిన రైతులకు గడ్డుకాలం ఎదురైంది. ఇక బురకాయలకోట, సెంట్రల్‌స్కూల్ దేవలచెరువు, ములకలచెరువు వంటి చెరువులు నీళ్ల లేక ఎండిపోయాయి.కురబలకోట మండలంలో కనీసం మూగజీవాలు తాగడానికి కూడా నీళ్ల లేవు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో.. పొలాలు సాగుకు నోచుకోక బీళ్లగా ఉన్నాయి.

రాయచోటి మండలంలో కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో.. నీటి పథకాలు అడుగంటిపోయాయి. గ్రామాల్లో తాగునీటి సమస్య వెంటాడుతోంది. మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు నీళ్ల లేక ఎండిపోయాయి. లక్కిరెడ్డిపల్లెలో మూడేళ్లుగా సరైన వానలు లేక.. మామిడి తోటలు నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. ఈ ఏడాది కూడా వానలు పడకపోవడంతో.. మామిడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లక్షల రూపాయలు పెట్టి.. బోర్లు వేసినా.. చుక్క నీళ్ల పడడం లేదు. రూ.700 పెట్టి.. ట్యాంకర్ నీళ్ల కొని చెట్లకు పెట్టి బతికించుకుంటున్నాం. మదనపల్లె మండలంలోని చెరువుల్లో నీటిమట్టం తగ్గుముఖం పట్టాయి. పలు చెరువుల్లో కేవలం పదిశాతం మాత్రమే నీళ్ల ఉన్నాయి. మండలంలో భూగర్భ జలాలు సుమారు 70 మీటర్ల కిందకు వెళ్లాయి.


కలకడ మండలంలో భూమిపై పచ్చిక లేక ఎండుటాకులు మేస్తున్న గొర్రెలు

కలకడ మండలంలో గతేడాది సరిగా వర్షాలు కురవలేదు. చెరువుల్లో నీళ్ల లేవు.. దీంతో రబీలో ఆశించిన స్థాయిలో రైతులు పంటలు సాగు చేయలేదు. టమోటా. వరి, వేరుశనగ వంటి పంటల విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. కొద్దోగొప్పో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. బోర్లలో నీళ్ల తగ్గిపోయాయి. ఇక్కడి రైతులు కర్నాటక రాష్ట్రం శ్రీనివాసపురం, చిత్తూరు జిల్లాలోని చిన్నగొట్టిగిల్లు, ఎర్రావారిపాలెం, భాకరాపేట, సోమల, చౌడేపల్లి తదితర మండలాలకు వలస వెళ్లి టమోటా సాగుచేసి నష్టాలు మూటకట్టుకున్నారు. పాడిరైతుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. భూమిపై పచ్చిక కనుమరుగవడంతో..మూగజీవాలు మేత కోసం ఇబ్బంది పడుతున్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో కరువు మండలంగా ప్రకటించారు.

19 కరువు మండలాలు

గతేడాది ప్రభుత్వం జిల్లాలో 19 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. జిల్లాలో 30 మండలాలు ఉండగా.. అందులో గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లె, సుండుపల్లె, వీరబల్లి, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె రామాపురం, తంబళ్లపల్లె, గుర్రంకొండ, కలకడ, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కురబలకోట, పీటీఎం, బి.కొత్తకోట, మదనపల్లె, నిమ్మనపల్లె ఉన్నాయి. ఈసారి ఒకటి కూడా చోటు దక్కించుకోలేదు.

కొంపముంచిన సగటు వర్షపాతం

జిల్లాలో గతేడాది అక్టోబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు 242.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే.. 5.1 శాతం తక్కువ నమోదైంది. 3 మండలాల్లో సాధారణం కంటే.. ఎక్కువగా నమోదు కాగా.. 13 మండలాల్లో సాధారణం కంటే.. కొంచెం ఎక్కువగా నమోదైంది. 6 మండలాల్లో సాధరణంగా నమోదైంది. 12 మండలాల్లో ఒక డ్రై స్పెల్ మాత్రమే నమోదైంది. మిగిలిన మండలాల్లో అసలు డ్రైస్పెల్ లేనే లేదు. దీంతో వాతావరణ ఆధారితంగా కరువు మండలాలను ప్రకటించేందుకు.. కేవలం 6 మండలాల్లో మాత్రమే సంతృప్తికరంగా నమోదైంది. ఇదే సమయంలో పంటల సాగును చూసినా.. అధికారుల లెక్కల ప్రకారం.. కరువు మండలాలుగా ప్రకటించే విధంగా పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో.. జిల్లాలో కరువు మండలాలను ప్రభుత్వం ప్రకటించలేదు. వర్షపాతం నమోదైనట్లు నివేదికలు ఉన్నా.. వాస్తవానికి రైతులకు ఉపయోగపడే విధంగా వానలు పడలేదనే చెప్పవచ్చు.

వేరే గత్యంతరం లేదు

నా కుటుంబం టమోటా పంట సాగు చేసి జీవనం సాగిస్తున్నాము. మా గ్రామంలో సొంత భూమి ఉంది. కానీ రబీ సీజనులో సాగుకు అవసరమైన నీటి వనరులు లేవు. దీంతో గత పదేళ్లుగా పంట సాగుకు బయట ప్రాంతాలకు వెళ్తున్నాం. ఈ ఏడాది చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలో మూడు ఎకరాలు భూమి లీజుకు తీసుకుని టమోటా సాగు చేశా. ప్రస్తుతం ధరల పతనంతో నష్టాల పాలవుతున్నాం. వీలైనంత త్వరగా హంద్రీ-నీవా కాలువ ద్వారా సాగునీరు అందించి ఆదుకోవాలి.



- శివశంకర్‌నాయుడు, కలకడ

మూడు నెలలకే నీళ్లు తగ్గాయి

గతేడాది డిసెంబర్‌లో నాకున్న పొలంలో 600 అడుగుల్లో బోరువేశాను. ఆ సమయంలో నీళ్లు పుష్కలంగా పడ్డాయి. దీంతో కరెంటు, మోటారు, పైపుల కోసం లక్షల రూపాయలు ఖర్చుచేశాను. అంతేకాకుండా.. అర కిలోమీటరు దూరం వరకు పైపు లైన్ కోసం రూ.లక్ష ఖర్చు చేశాను. ఎకరా పొలంలో టమోటా సాగు చేశాను. ప్రస్తుతం టమోటా పూత దశలో ఉంది. రెండు రోజుల నుంచి బోరులో నీళ్లు తగ్గాయి. దీంతో పంట ఎండి పోయే ప్రమాదముంది.




- లక్ష్మీపతి, గుర్రంకొండ

రామయ్యకు బ్రహ్మోత్సవ శోభ

ఒంటిమిట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామాలయం బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంటోంది. ఆలయ పరిసరాలు, ఒంటిమిట్ట పురవీధులు, కల్యాణవేదిక ప్రాంతాల్లో వివిధ రకాల విద్యుద్దీపాలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామ పురవీధుల్లో శ్రీరామనామస్మరణ మారుమోగుతోంది. ఈ ఏడాది టీటీడీ వారు కోదండరాముని వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్నిరకాల ఏర్పాట్లను చేస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన కూడలిలో విద్యుత్ కటౌట్‌లను అమర్చారు. అలాగే ఆలయ మాడవీధుల్లో భక్తులకు ఎండ తాకిడి తగలకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఈ నెల 5 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు.


భక్తులను ఆకట్టుకుంటున్న విద్యుత్ కటౌట్


విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న కోదండరామాలయం


శోభాయమానంగా ఒంటిమిట్ట ఆలయం

కరువు జిల్లాగా ప్రకటించకపోవడం దారుణం

- రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలం
- మీడియా సమావేశంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన, రైతులు వర్షాధారంపై ఆధారపడి జీవిస్తున్న జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించకపోవడం దారుణమని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతి భద్రతలు పూర్తి స్థాయిలో క్షీణించాయని, ప్రజలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అంతా అమరావతికే పరిమితం చేస్తే వెనుకబడిన ప్రాంతాల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. టీడీపీ బిల్లులో సవరణల కోసం వైసీపీ మొఖం చాటేసిందని చెప్పడం దారుణమని పేర్కొన్నారు. జిల్లాలో గత ప్రభుత్వంలో స్థలంతో పాటు నిధులు మంజూరు చేసిన కలెక్టర్ బంగ్లా, శిల్పారామం, పీజీ సెంటర్, జడ్పీ కార్యాలయం వంటి అభివృద్ధి పనులు నిలిచిపోతే పట్టించుకోరా అన్నారు. ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా, గత ప్రభుత్వాన్ని విమర్శించడమే పాలనగా కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మండల బీసీ నాయకులు పల్లపు రమేశ్, మైనార్టీ నాయకులు రబ్బాని తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారుల పనితీరే ప్రామాణికం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 2: రెవెన్యూ అధికారుల పనితీరే ప్రభుత్వ పనితీరుకు ప్రామాణికమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఉద్దేశించి అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని సుధా ఫంక్షన్ హాలులో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాయచోటి డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు, మండల సర్వేయర్లు, ఆర్‌ఎస్డీటీలు, వీఆర్‌వో, వీఆర్‌ఏలతో రెవెన్యూ అంశాలపై డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారుల సదస్సు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సర్వే శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్‌ఎస్ ఫిర్యాదులు, రీసర్వే ప్రగతి, మంజూరైన పొషిషన్ సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ పురోగతి, హౌస్ సైట్స్ రీవెరిఫికేషన్ పురోగతి, పెండింగ్‌లో ఉన్న భూమి అన్యాక్రాంతం, భూసేకరణ, కోర్టు కేసులు, నివాస యూనిట్ల ద్వారా అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిపై ఆక్రమణల క్రమబద్ధీకరణ, అసైన్‌మెంట్ భూముల కేటాయింపు తదితర రెవెన్యూ అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గుర్రంకొండ తహసీల్దార్ ఈ సమావేశంలో అవగాహన కల్పించారు. అలాగే క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల్లో తీసుకోవాల్సిన చర్యలపై సర్వేయర్లు, ఆర్ ఎస్డీటీలు, వీఆర్‌వో, వీఆర్‌ఏలు వెలిబుచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల పనితీరును ప్రజలందరూ పరిశీలిస్తూ ఉంటారని, చట్ట ప్రకారం, మార్గదర్శకాలు మేరకు పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ భూములు ఎట్టి పరిస్థితుల్లో అన్యాక్రాంతం కాకూడదని ఆదేశించారు. ఈ సర్వేకి ముందు ప్రీ సర్వే తర్వాత ప్రభుత్వ భూమిలో ఎటువంటి మార్పు రాకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు గుర్తించాల్సిన భూముల విషయంలో ఏమైనా పెండింగ్ పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్వే శాఖ ఏడీ భరత్‌కుమార్, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలకు
అంకురార్పణ


అంకురార్పణలో భాగంగా విష్వక్సేనుల ఉత్సవంలో టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, వేదపండితులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసునామ సంవత్సర వార్షిక చాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. అంతకుముందు ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అలంకరణ, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కలశ స్థాపన చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల గోష, భక్తజనం నడుమ అంకురార్పణ కార్యక్రమాలు జరిగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు, కృష్ణప్రసాద్ భట్టర్, కృష్ణరాజు, భాషికాచార్యులు, ధనుష్‌భట్టర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8.30 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ, అనంతరం రాత్రి 8 గంటలకు గజవాహనంపై సీతారామలక్ష్మణుల నగరోత్సవం కార్యక్రమాలు జరగనున్నాయి.

విద్యార్థులు వ్యవస్థాపకులుగా మారితేనే సమాజాభివృద్ధి

- జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యవస్థాపకులుగా మారితే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఎంటర్ ప్రిన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, జిల్లా స్థాయి ప్రాజెక్టుల ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వ్యవస్థాపక మనస్తత్వ ఆలోచనలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ, ఉద్యమ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా జిల్లాలోని 40 పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థులకు వ్యవస్థాపక మనస్తత్వం అభివృద్ధి పరిచే కార్యక్రమాన్ని అమలుపరిచామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సమాచార నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచనలు, సృజనాత్మకత వంటి నైపుణ్యాలు పెంపొంది విద్యార్థులు వ్యవస్థాపకులుగా రూపొందుతారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 40 పాఠశాలల నుంచి విద్యార్థులు రూపొందించిన ఉత్పత్తులను ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించామన్నారు. అత్యుత్తమ ఉత్పత్తులను తయారు చేసిన విద్యార్థులను ఎంపిక చేసి మెమెంటో, సర్టిఫికెట్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, జ్యూరీ సభ్యులు ఆంజనేయులు, శివలక్ష్మి, ఉద్యమ్ జిల్లా కోఆర్డినేటర్ కరీముల్లా, నాయకులు రామచంద్ర, ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ

మామిడికి కవర్



మామిడి కాయకు రక్షణ కవర్

- రైతులకు కోటి కవర్ల పంపిణీ లక్ష్యం
- 50 శాతం సబ్సిడీతో...
- రైతుకు లాభం..వినియోగదారుడికి తియ్యని రుచులు

వేసవి వచ్చిందంటే మధురఫలం..మామిడి పండు రుచిచూడని వారుండరంటే అతిశయోక్తి కాదు. అటువంటి మామిడి పండు పూత నుంచి పిందె, కాయ, పక్వానికి వచ్చే సరికి 120 రోజులు పడుతుంది. చీడపీడలు, వాతావరణ పరిస్థితులను ఎదుర్కొని నిలిచిన మామిడి పండే మన నోటికి అందుబాటులోకి వస్తుంది. అటువంటి మామిడి పండు పరిరక్షణకు ఉద్యానశాఖ అధికారుల సహకారంతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ నేతృత్వంలో మామిడి కాయ పక్వ దశకు వచ్చే వరకు రక్షణ కవచంగా ప్రత్యేక కవర్ల విధానం అమలులోకి తీసుకొస్తున్నారు.

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఎక్కువగా బేనీషా రకం మామిడి తోటలు సాగవుతున్నాయి. వీటితో పాటు జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో నీలం, ఇమామ్‌పసంద్, కేసరి రకం మామిడి తోటలు, జ్యూస్ ఫ్యాక్టరీకి తరలించే మామిడి బెంగళూరు రకం తోటలు కూడా సాగవుతున్నాయి. 1700 హెక్టార్లలో బేనీషా రకం మామిడి కాయల పరిరక్షణకు తొలివిడతగా ఉద్యానశాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా చైనా నుంచి దిగుమతి చేసుకున్న ప్రత్యేక సంచులను 50 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేయనున్నారు. మల్చింగ్ పేపర్ తరహాలో లోపల నల్లని కవరు, బయట మైనం కోటింగ్‌తో ఉండే ఈ సంచులు 20 సెంటీమీటర్ల వెడల్పు, 30 సెంటీ మీటర్ల పొడవు, 15కు 25 సెంటీమీటర్ సైజులతో రెండు రకాలుగా సంచులు తెప్పిస్తున్నారు. సంచి మొదట్లో జీఐ వైరు ఉండటం వలన కాయ మీద ఒత్తిడి లేకుండా కేవలం కాడతోనే జీఐ వైరు ఉండే సంచిని అమరుస్తారు.

50 శాతం సబ్సిడీతో కోటి సంచుల పంపిణీకి చర్యలు

జిల్లాలో మామిడి రైతులకు ప్రత్యేక సంచుల అవసరం గురించి ఉద్యానశాఖ విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. ఒక ఎకరాకు 4 టన్నులు (12 వేల కాయలు) లెక్కన ఈసారి సీజన్‌లో కోటి సంచులను రైతులకు పంపిణీ చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వాస్తవంగా ఈ సంచులు ఒక్కొక్కటి రూ.2.40 పైసలు ధరకు కొనుగోలు చేసి 50 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తారు. ఒక్కో సంచి రూ.1.20 పైసలు కొనుగోలు చేసే రైతులు వీటిని కాయలకు తొడిగేందుకు మరో కూలి రూ.1.20 ఖర్చు చేయాల్సి వస్తుంది. కేవలం ఒక్కో కాయకు రూ.4 వరకు మాత్రమే ఖర్చు వచ్చే క్రమంలో ఈ సంచులతో ఉపయోగాలు అనేకం ఉన్నాయి. దీంతో రైతులు వీటిపై పలుచోట్ల ఆరా తీస్తున్నారు.

ఆలస్యంగా మామిడి దిగుబడి

సాధారణంగా జిల్లాలో మామిడి సాగు జనవరి నుంచి మే వరకు సాగై మే నెలాఖరు జూన్ నెలల్లో మామిడి పండ్లు తినడానికి సిద్ధమవుతాయి. కాగా ఈసారి జనవరి నెలలో కొన్నిచోట్ల మామిడి పూత విరగ్గాసింది. కానీ ఎండ వేడిమికి పూత అంతా రాలిపోయి, ఒక నెల ఆలస్యంగా పక్వానికి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. అంటే సుమారు 20 రోజుల సీజన్ ఆలస్యమయ్యే సూచనలున్నాయి. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలతో పోలిస్తే మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో వాతావరణం చల్లగా ఉంటుంది. దీంతో ఈ ప్రాంతాల్లో ఆలస్యంగా మామిడి కోతలు పడతాయి. అంటే మరో 20 రోజుల్లో తూర్పు ప్రాంతాల్లో మామిడికాయలు కోడిగుడ్డు సైజుకు రానున్నాయి. ఆ తరువాతనే ప్రత్యేక సంచులను కాయలకు తొడుగుతారు. దీనిని బట్టి చూస్తే మరో 20 రోజుల్లో రాజంపేట, రైల్వేకోడూరు, తరువాత పీలేరు, రాయచోటి, మదనపల్లె ప్రాంతాల్లో కాయలకు ప్రత్యేక సంచులు కట్టనున్నారు.



కాయలకు తొడిగిన ప్రత్యేక సంచులు (ఫైల్)

పురుగులతో మామిడికి దెబ్బ

మామిడిసాగులో పూత నుంచి పిందె దశకు వచ్చే వరకు 60 రోజుల సమయం పడుతుంది. జనవరిలో మొదలయ్యే పూత ఫిబ్రవరి ఆఖరుకు పిందె దశకు వస్తుంది. ఈ పిందె కోడిగుడ్డు సైజు వచ్చే సరికి ఊజి పురుగు దాడి చేస్తుంది. ఈ ఊజి పురుగు మామిడికాయపై చిన్నగా కాట్లు వేసి రంధ్రాలు చేసి అందులో గుడ్లను విడిచి పెడుతుంది. ఈ గుడ్లు కాయతో పాటు పెరిగి పురుగులు ఏర్పడి మామిడి పండును తినడానికి కూడా పనికిరాకుండా చేస్తాయి. అలాగే కాయ పక్వానికి వచ్చే దశలో గొంగళి పురుగు దాడి చేస్తుంది. కాయపై బొక్కలు పెట్టి, కాడ పలచబడేలా చేసి చెట్టు నుంచి కాయ కిందకు పడేలా చేసేస్తుంది. ఎర్రనల్లి, నల్లనల్లి పురుగు (త్రిప్స్) మామిడి కాయపై పొర కొరుకుతూ వాతలు పెడుతుంది. ఈ వాతలతో నల్లమచ్చలు ఏర్పడి మంగులా తయారవుతాయి. ఈ కాయలు తినడానికి కూడా పనికి రాకుండా పోతాయి. వీటికి అదనంగా ఎండ, వాన, గాలి తదితర వాతావరణ పరిస్థితులతో మామిడి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది.



మామిడిపండుపై గొంగళి పురుగు దాడి (ఫైల్)



ఎర్రనల్లి పురుగుదాడి చేయడంతో దెబ్బ తిన్న మామిడి పండు (ఫైల్)

ప్రత్యేక సంచులతో రక్షణ

మామిడి కాయలను పరిరక్షించడానికి ప్రత్యేకంగా తయారు చేసిన సంచులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ముఖ్యంగా ఊజి, గొంగళి, ఎర్రనల్లి, నల్లనల్లి పురుగుల దాడుల నుంచి ఈ సంచులు కాపాడతాయి. మామిడికాయ కోడిగుడ్డు సైజుకు వచ్చే సరికి ఈ సంచులను కాయలకు తొడుగుతారు. మామిడి కాయ కాడ ఆధారంగా సంచుల్లోనే పెరిగి పెద్దవి అవుతాయి. 60 రోజుల వరకు ఈ సంచులు రక్షణ కవచంలా ఉంటాయి. దీంతో పాటు కాయ పెరిగే సాధారణ సైజు కన్నా 10 శాతం అదనంగా బరువు పెరుగుతుంది. పురుగు మందులు మామిడికాయకు తగిలే అస్కారం లేకపోవడంతో ఆర్గానిక్ తరహా కాయలు మార్కెట్‌కు వస్తాయి. ఎండ నుంచి రక్షణ ఇవ్వడంతో పాటు ఎనిమిది గంటల ఏకధాటి వర్షానికి కూడా ఈ సంచులు తడవకుండా కాయకు రక్షణ కల్పిస్తాయి. 40 కిలోమీటర్ల వేగంతో వీచే గాలుల నుంచి కూడా కాయలు కిందపడకుండా కాడల ఆధారంగా ఈ సంచులు రక్షణ ఇస్తాయి. ఇన్ని విధాల రక్షణ కల్పించే మామిడి ప్రత్యేక సంచులకు త్వరలో డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది.



ప్రత్యేక సంచుల్లో పెరిగి ఎగుమతికి సిద్ధమైన మామిడి పండ్లు (ఫైల్)



ప్రణాళికాబద్ధంగా సంచులు తెప్పిస్తాం

జిల్లాలో మామిడి సాగు 20 నుంచి 30 రోజులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీని ఆధారంగా ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక సంచులు దిగుమతి చేయిస్తున్నాం. పాసుపుస్తకాలు ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీతో ఈ సంచులు అందిస్తాం. పాసుపుస్తకాలు లేని వారు బయట దుకాణాల్లో ఈ సంచులు కొనుగోలు చేసుకోవచ్చు. జిల్లాలో కోటి సంచుల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నాం.

- రవిచంద్రబాబు, ఉద్యాన శాఖ, జిల్లా అధికారి, రాయచోటి.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం స్వాధీనం



ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

కురబలకోట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ బండపల్లె సమీపంలో గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలో బండపల్లె సమీపంలో సర్వేనంబర్ 582లోని 79 సెంట్లలోని కొంత స్థలంలో ఆర్‌బీకే రోడ్డు నిర్మించారు. వాటికి పోగా మిగిలిన దాదాపు 30 సెంట్ల స్థలాన్ని కొంతమంది వైసీపీ నేతల అండతో ఆక్రమించు కున్నారు. ఈ విషయం స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో అధికారులు స్పందించారు. ఆక్రమణకు గురైన భూమిని ప్రభుత్వానికి చెందిన భూమిగా నిర్ధారిస్తూ రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తపస్విని మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా భూములను ఆక్రమించుకుని ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆ భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుబ్రమణ్యం, వీఆర్వోలు ఖాదర్‌బాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోండి

- ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి కృష్ణయ్య

రాయచోటిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సమ్మర్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ విద్య జిల్లా అధికారి కృష్ణయ్య సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రారంభమైన సమ్మర్ క్లాసులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులతో ఈ నెల 1 నుంచి 23వ తేది వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సమ్మర్ క్లాసులు జరుగుతున్నాయన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచడమే కాకుండా వెనుకబడి ఉన్న విద్యార్థులను మరింత ముందుకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతో సమ్మర్ క్లాసులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ 24 నుండి మే 31వరకు వేసవి సెలవులు ఉంటాయని, జూన్ 2 నుండి తిరిగి కళాశాలలు ప్రారంభమవుతాయన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

కలికిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కలికిరి పంచాయతీలోని చిన్నమాలపల్లె దళితవాడలో బుధవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పలు శాఖలకు చెందిన అధికారులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు దళితుల హక్కని స్పష్టం చేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాస వర్మ, ఏసురాజు, తహసీల్దారు మహేశ్వరిబాయి, వీఆర్వోలు, గ్రామ పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.



కలికిరి చిన్నమాలపల్లె మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మహిళలు, అధికారులు

శ్మశానవాటికలో క్షుద్ర పూజలు...!

- ఆందోళనలో ఇందిరమ్మకాలనీ వాసులు

గుర్రంకొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్మశానం, పొలాల్లో కొన్ని రోజులుగా క్షుద్రపూజలు చేస్తుండంతో ఇందిరమ్మకాలనీ, జగనన్న కాలనీ వాసులు ఆందోళనకు గురవున్నారు. కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు బయటి ప్రాంతాల నుంచి మాంత్రికులను పిలిపించి పూజలు చేయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

గుర్రంకొండ పట్టణానికి సమీపంలోని ఇందిరమ్మకాలనీలో 650 కుటుంబాలు, జగనన్న కాలనీలో 300 కుటుంబాలు ఉన్నాయి. ఈ కాలనీలో ఇళ్లను నిర్మించుకున్న పలువురు వాటిని ఇతరులకు బాడుగకు ఇచ్చారు. మరి కొందరు ఇళ్లను అమ్ముకోవడంతో బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు కొనుగోలు చేసి నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు కాలనీల్లో ఎక్కువ శాతం బయటి ప్రాంతాలకు చెందిన వ్యక్తులే ఉన్నారు. వీరిలో కొందరు నేరచరిత్ర కలిగిన వారు ఉన్నట్లు కాలనీ వాసులు గుసగుసలాడుతున్నారు. కాగా, కాలనీలో ఉన్న కొందరు వ్యక్తులు గుప్త నిదులు, క్షుద్ర పూజల ముఠాలను పిలిపించి చుట్టుపక్కల ప్రాంతాల్లో క్షుద్రపూజలతో పాటు తవ్వకాలు చేస్తున్నట్లు కాలనీ వాసులు చర్చించుకుంటున్నారు. ఇలాంటి వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్ఐ మధు రామచంద్రుడు మాట్లాడుతూ గుర్రంకొండ ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో పోలీస్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, కొత్త వ్యక్తుల వివరాలను సేకరించి చర్యలు తీసుకుంటామన్నారు.



క్షుద్ర పూజలు చేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్న ప్రాంతం, వినియోగించిన వస్తువులు


అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బి.కొత్తకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని పశువుల ఆసుపత్రి సమీపంలో నివాసం ఉంటున్న తమ్మిశెట్టి రత్నమయ్య (30) బుధవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో సీలింగ్ ఫ్యానుకు తన పంచెతో ఉరి వేసుకున్నాడు. కుటుంబీకులు గమనించేలోపే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి వెంకట్రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న రత్నమయ్య

రక్షణ కోరిన ప్రేమజంట



పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రేమజంట

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెద్దల నుంచి రక్షణ కల్పించాలంటూ ఓ జంట బుధవారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన సిసింద్రీ (23) కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, మదనపల్లె మండలం, బోడుమోళ్లదిన్నెకు చెందిన శ్రావణి (22) డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటుంది. డిగ్రీ చదువుకునే రోజుల్లో వారు ప్రేమించుకున్నారు. కులాలు వేరు కావడంతో ఇరువురి తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో ఇటీవలే ఇంట్లో నుంచి వెళ్లిపోయి ప్రేమవివాహం చేసుకున్నారు. అనంతరం రక్షణ కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. తన కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందంటూ శ్రావణి తన ఫిర్యాదులో పేర్కొంది. ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు రప్పించి కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉండాలి: కలెక్టర్

రాజంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అధికారులు రెవెన్యూ చట్టాలు, మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీ ఆడిటోరియంలో డివిజన్‌స్థాయి రెవెన్యూ అధికారుల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రజల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు బాధ్యతాయుతంగా జవాబుదారితనంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అసైన్‌మెంట్ భూములపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యవస్థలో లోపాలు సరిదిద్దుకొని ముందుకు వెళ్లినప్పుడే పనితీరు మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్ మాట్లాడుతూ రెవెన్యూ అంశాలలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను బాధ్యాతయుతంగా పూర్తి చేయాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో నిబంధనలు పాటించాలన్నారు. సబ్‌కలెక్టర్ నిదియాదేవి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో జేసీ, సబ్‌కలెక్టర్

డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల నిర్వాహకుల నుంచి డ్రైవింగ్ శిక్షణా కేంద్రాల ఏర్పాటు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్లు, విద్యాసంస్థల ప్రతినిధులు, ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటు కోసం అనుమతులు ఇస్తోందన్నారు. ఈ కేంద్రాలు ఏర్పాటు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కింద ఆర్థిక సహాయం కూడా చేస్తుందని తెలిపారు. జిల్లాలో ఎవరైనా అర్హత ప్రమాణాలతో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్

రుణ ప్రణాళికను సక్రమంగా నమోదు చేయాలి

వీరబల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సభ్యుల జీవనోపాధులు, కుటుంబ అవసరాల రుణ ప్రణాళికలు సక్రమంగా నమోదు చేయాలని జిల్లా జీవనోపాధుల ప్రాజెక్టు మేనేజర్ గంగార్జున, ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన వీవోఏలు, ఎన్యుమరేటర్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 660 స్వయం సహాయక సంఘాలకు గానూ ప్రతి 6 సంఘాలకు ఒక ఎన్యుమరేటర్ చొప్పున 106 మందికి శిక్షణ ఇచ్చి సంఘాల సభ్యులందరితో ముఖాముఖి చర్చించి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్‌వలి, సీసీలు నాగేంద్ర, కృష్ణయ్య, సుధాకర్, గంగాధర్ పాల్గొన్నారు.

జనసేన నేతపై దాడికి యత్నం

వీరబల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జనసేన మండల కన్వీనర్, వార్డు మెంబర్ గుగ్గిళ్ల వెంకటేష్‌పై సానిపాయి సర్పంచ్ నేతి ఆంజనేయులు, వారి కుటుంబ సభ్యులు మారణాయుధాలతో దాడికి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. అయితే వెంకటేష్ త్రుటిలో తప్పించుకొని పారిపోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడన్నారు. గతంలో సర్పంచ్ దాదాపు రూ.26 లక్షల అవినీతి చేసినట్లు కలెక్టరుకు తాను ఫిర్యాదు చేయడంతోనే తనపై కక్ష పెంచుకొని ఇలా దాడికి యత్నించినట్లు బాధితుడు తెలిపాడని అంటున్నారు. ఈ విషయంపై ఎస్ఐ బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి విచారించారు. కాగా రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, జనసేన రాజంపేట నియోజకవర్గ సమన్వయకర్త దినేశ్ బాధితుడిని పరామర్శించారు.

యూట్యూబర్స్‌పై కేసు నమోదు

రైల్వేకోడూరురూరల్,ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇద్దరు యూట్యూబర్స్ మరొక విలేకరి (ఆంధ్రజ్యోతి కాదు)పై సీఐ కె.హేమసుందర్ బుధవారం కేసు నమోదు చేశారు. యూట్యూబర్స్ ముప్పాల శంకర్‌రాజు, సత్యనారాయణ రెడ్డి, విలేకరి గూడూరు సుబ్రహ్మణ్యం రాజు తన విధులకు ఆటంకం కలిగించి, తప్పుడు వార్తలు ప్రచురించి, డబ్బుల కోసం బెదిరించారని కోడూరు రేంజర్ పీపీ శ్యాంసుందర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి

- ఎంపీ మిథున్‌రెడ్డి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఒంటిమిట్టలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన రైల్వేబోర్డు ఛైర్మన్ సతీష్, కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు లేఖ రాశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు కోదండరాముడి దర్శనానికి వస్తారని, వారి సౌకర్యార్థం ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో తిరుమల, వెంకటాద్రి, రాయలసీమ, గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని లేఖలో పేర్కొన్నారు.

ఘర్షణలో వృద్ధుడికి గాయాలు

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భూ వివాదం కారణంగా జరిగిన ఘర్షణలో ఓ వృద్ధుడు గాయపడినట్లు ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు. పీటీఎం మండలం, రాపూరివారిపల్లె గ్రామం, కొత్తపల్లెకు చెందిన యర్రంరెడ్డి కుమారుడు రామకృష్ణారెడ్డి (74)కు డి.నారాయణపల్లె వద్ద నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో తమకు భాగం ఉందని రామకృష్ణారెడ్డికి వరుసకు మనుమళ్లు అయిన ప్రతాప్‌రెడ్డి, శబరీష్‌రెడ్డిలు బుధవారం పొలం వద్ద ఘర్షణ పడ్డారు. ఈ గొడవలో రామకృష్ణారెడ్డి తలపై వారు కర్రతో దాడి చేశారు. దీంతో గాయపడిన వృద్ధుడిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పీటీఎం ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులపై గతంలో కూడా కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

ఒంటిమిట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపల్లె గ్రామానికి చెందిన గోపినేని మహేశ్వరి మెడలో ఉన్న బంగారు గొలుసు (సరుడు)ను దొంగ లాక్కొనిపోయినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మహేశ్వరి బుధవారం ఉదయం ఆమె తల్లితో కలిసి గేదెలను మేపుకొనేందుకు అడవికి వెళ్లారు. తల్లి అడవి లోపలికి వెళ్లడంతో మహేశ్వరి ఇంటికి బయలుదేరింది. దారిలో వర్మీకంపోస్టు డంపింగ్ యార్డు వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి తన మెడలోని తాలిబొట్టు సరుడును లాక్కొనేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో దొంగ కత్తి చూపించి భయపెట్టి బంగారు సరుడును లాక్కొని వెళ్లిపోయినట్లు తెలిపారు. సరుడు 3 తులాలు ఉంటుందని, బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంతా...గందరగోళం

- జీవనోపాధికి ఇచ్చిన పౌల్ట్రీ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు
- అధికారుల వద్ద రెండు రకాల జాబితాలు
- దిక్కుతోచని స్థితిలో అధికారులు
- దుర్వినియోగమైన స్థలాల స్వాధీనంలో మీనమేషాలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ భూములను పరిరక్షించుకోవడం అంత సులువు కాదనిపిస్తోంది. కొంతమంది కార్యాలయ సిబ్బంది సహకారంతో ఏకంగా ఫైళ్లు తారుమారు చేసినట్లు స్పష్టం అవుతోంది. దీంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నా ఫైళ్లన్నీ గందరగోళంగా ఉన్నాయి. ఈ క్రమంలో వారు పెద్దగా ఆసక్తిచూపకపోవడతో ఆక్రమంచిన వారివే ఆస్తులు అనే విధంగా పరిస్థితులు తయారయ్యాయి. అక్రమార్కులు ఇచ్చే ముడుపులకు ఆశపడి కొంతమంది సిబ్బంది వివిధ సందర్భాలాల్లో ఎస్సీ కార్పొరేషన్ కార్యాల యంలోని రికార్డులను ట్యాంపరింగ్ చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతు న్నాయి.

జీవనోపాధికి అవకాశం ఇస్తే...

కోళ్ల (పౌల్ట్రీ) పరిశ్రమ ద్వారా ఎస్సీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో 1984-85 సంవత్సరంలో ఉమ్మడి కడప జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టారు. కొంతకాలం బాగానే ఉన్నప్పటికి కాలక్రమేణా అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిల్లో రాజంపేట మండలలోని తాళ్లపాక వద్ద నిర్మాణం చేసిన పౌల్ట్రీ కాంప్లెక్స్ కడప-తిరుపతి ప్రధాన దారి పక్కనే ఉండడం వల్ల లబ్ధిదారుల్లోని కొంతమంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీనికి ఎవరూ అడ్డుచెప్పకపోవడంతో నిర్మాణాలు జోరందుకున్నాయి. ఇంతలో ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు ఏర్పాటు కావడంతో ఇళ్లస్థలాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం అక్కడ సెంటు స్థలం రూ.12లక్షలు నుంచి రూ.15లక్షలు వరకు ధర పలుకుతోంది. ఇదే అదునుగా భావించిన లబ్ధిదారుల్లోని కొంతమంది ఎస్సీ కార్పొరేషన్ పౌల్ట్రీ స్థలాన్ని వ్యాపారానికి తెరలేపారనేది సమాచారం. అక్కడ తాము ఆక్రమించుకున్న స్థలంలో కొంతభాగాన్ని విక్రయంచగా వచ్చిన


పౌల్ట్రీస్థలంలో విచారణ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ (ఫైల్)

సొమ్ముతో విలాసవంతంగా భవనాలు నిర్మించుకుంటున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎస్సీ కార్పొరేషన్‌లోని కొంతమంది సిబ్బంది కూడా పరోక్షంగా లబ్ధిపొందినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో లబ్ధిదారుల జాబితా కూడా ట్యాంపరింగ్‌కు సిబ్బంది పాల్పడినట్లు సమాచారం.

రెండు జాబితాలు.. ఏదీ వాస్తవం

పౌల్ట్రీ లబ్ధిదారుల జాబితాలో గందరగోళం ఏర్పడింది. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలోనే రెండు రకాల జాబితాలు ఉంటున్నాయి. ఒక జాబితాలో 2019వ సంవ త్సరంలో అప్పటి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మురళీమనోహర్ సంతకం చేసిన జాబితాలో 30 మంది లబ్ధిదారుల పేర్లు ఉన్నాయి. కానీ ఇపుడు మాత్రం తెరపైకి 20 మంది పేర్లతో ఉన్న జాబితా వస్తోంది. ఈ రెండు జాబితాలో ఏది వాస్తవం అనేది అర్థం కాని పరిస్థితి. ఎస్సీలలోనే ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తుల పేర్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. 1984-85 సంవత్సరాలలో రూపొందించిన జాబితలో ఎక్కడ ఉండేది ఎవరికి తెలియని పరిస్థితి కనిపిస్తుంది. ఇదిలా ఉంటే 2019లో ఈడీ మురళీమనోహర్ సంతకంతో ఉన్న జాబితాను పరిగణలోకి తీసు కుంటారా లేకుంటే ఏ అధికారి సంతకం లేని 20 మంది పేర్ల జాబితాను పరి గణలోకి తీసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎందుకంటే ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో లబ్ధిదారుల జాబితా అడిగతే 20 మంది పేర్లు ఉన్న జాబితానే ఇస్తున్నారు. పౌల్ట్రీ కాంప్లెక్స్‌లో మొదటి నుంచి ఉపాధి పొందిన వారిలో కొంతమంది కాంప్లెక్స్ శిథిలావస్థలకు చేరుకోవడంతో వదిలిపెట్టారు. కానీ ఇపుడు మాత్రం అధికారులు తిరిగి పౌల్ట్రీస్థలాన్ని పరిశీలిస్తుండడంతో జాబితాలో తమ పేర్లు ఉన్నా యంటూ కొంతమంది లబ్ధిదారులు వెలుగులోకి వస్తున్నారు. కానీ నూతనంగా రూపొందించిన జాబితాలో మాత్రం 20 పేర్లు మాత్రమే ఉండడం అనుమానం కలిగిస్తోంది. దీంతో తమ పేర్లు అధికారిక జాబితాలో ఉన్నాయా లేదా అనే ఆందో ళన కొంతమంది లబ్ధిదారుల్లో నెలకొంది. అధికారులు సైతం ఈ అంశంపై దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు సమాచారం.

స్థలాల స్వాధీనంలో మీనమేషాలు

వాస్తవానికి ఎస్సీ కార్పొరేషన్ కేవలం జీవనోపాధుల కల్పన కోసమే కాంప్లెక్స్ కట్టిం చారు. అయితే అవి కూలిపోయి నిరుపయోగంగా మారడంతో పాటు ఆక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో తమ భూములు స్వాధీనం చేసుకునే దిశగా అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. కానీ తమ భూములు హద్దులు చూపడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు చర్చ సాగుతుంది. ఈ విషయాలపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అన్ని రికార్డులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి : డీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. బుధ వారం చెన్నూరు గ్రామ పంచాయతీలో పంచాయతీలో ఘన, వ్యర్థాల నిర్వహణపై క్లాప్ (గ్రీన్‌అంబాసిడర్స్) మిత్రలు, పంచాయతీ కార్యద ర్శులకు ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచ్ ఎస్.వెంకట సుబ్బయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా డీపీవో మాట్లాడుతూ భూమిపై ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు వేసి భూశక్తిని నాశనం చేయవద్దన్నారు. ప్రతి షాపుల్లోవాడే ప్లాస్టిక్‌ను పరిశీలించాలని.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అమ్మ కుండా చేయాలన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్ర మిస్తే కేసులు నమోదు చేసే అధికారం పంచాయతీకి ఉందన్నారు. పారిశుధ్యంపై ఫిర్యాదులు రాకూడద న్నారు. జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ మాట్లాడుతూ గ్రామ పంచా యతీల్లో నీరు, పారిశుధ్యం నిర్వహణ ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం చెన్నూరులోని ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించి పంచాయతీలో సేకరించిన వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాను పరిశీలించారు. అలాగే వానపాముల ఎరువు ఎలా తయారు చేస్తున్నారు, రైతులకు ఎంతకు అమ్ముతున్నారని ఈవోపీఆర్‌డీని అడిగి తెలుసుకున్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య సంరక్షణ కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ప్రొద్దుటూరు నియోజకవర్గం కొత్తపల్లె పంచాయతీ కానపల్లెలో గ్రామ సచివాలయం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రాల సముదాయాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల ఆరోగ్య సంరక్షణ కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తోందన్నారు.ప్రజా ఆరోగ్య సంరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 3,260 హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్న తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్, ఉపాధి హామీ నిధులను పక్కదారి పట్టించడంతో పల్లె సీమలు అభివృద్ధికి దూరంగా ఉండిపోయాయన్నారు. దశాబ్దాల కాలంగా కడప పార్లమెంటు, ఒక అసెంబ్లీ నియోజకవర్గం ఒకే కుటుంబం చేతిలో ఉండిపోయాయని ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పదవులు వెలుగబెట్టినా కనీసం సొంత జిల్లా అభివృద్ధి నామమాత్రమే అన్నారు. గండికోట జలాలకు సంబంధించి పిల్ల కాలువలు తవ్వడం, అన్నమయ్య డ్యాం తెగిపోవడం, కడప స్టీల్‌ప్లాంట్‌కు నాలుగుసార్లు భూమి పూజ చేసి చెల్లికి జరగాలి పెళ్లి మళ్లీ మళ్లీ అన్న చందంగా పరిపాలన సాగిందని ఆయన విమర్శించారు.

ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పీ4 విధానాన్ని అమలుపరిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు దుర్మార్గమైన పాలనను తరిమికొట్టి అభివృద్ధి చేసే కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చెప్పారు. జిల్లాతోపాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి సుముఖంగా ఉన్నారని చెప్పారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘ జిల్లా అధ్యక్షుడు, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుబ్బిరెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి, కొత్తపల్లె ఎంపీటీసీ గోపాల్, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ప్రొద్దుటూరు తహసీల్దారు గంగయ్య, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


గ్రామ సచివాలయం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రాల సముదాయాలను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ బిల్

- మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష


మాట్లాడుతున్న అంజాద్‌బాష

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా కేంద్రం లోక్‌సభలో వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ 2025 బిల్లును తీసు కువచ్చిందని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాష తెలిపారు. దీనికి పార్లమెంటులో టీడీపీ ఎంపీలు మద్దతు పలకడం బాధాకరమన్నారు. బుధవారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ముస్లిం మైనార్టీ వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా ఈ బిల్లును ప్రవేశపెట్టారని ఆరోపించారు. 1954లో వక్ఫ్ చట్టం మన దేశంలో అమలులోకి వచ్చిందన్నారు. ప్రధాని మోడీ దుర్మార్గమైన పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం మతాలను కులాలను చీల్చాలని చూడడం దారుణమన్నారు. ఈబిల్లుకు పార్ల మెంటులో కూటమి ప్రభుత్వం మద్దతు ఇవ్వడం బాధాకరమన్నారు. మాజీ హజ్ కమిటీ ఛైర్మన్ గౌస్‌లాం, కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ ఉపకమిషనర్ శ్రీకాంత్‌నాయక్

కడప(వినాయకనగర్), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్మికుడు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కార్మికశాఖ ఉపకమిషనర్ శ్రీకాంత్‌నాయక్ పేర్కొన్నారు. జిల్లాలోని గిగ్ ప్లాట్ ఫాం వర్కర్లకు అవగాహన సదస్సును బుధవారం ఎన్జీవో కాలనీలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 600 మంది ప్లాట్‌ఫాం వర్కర్స్ జుమాటో, స్విగ్గి, ఓలా, ఉబర్ రాపిడో వంటి వాటిలో పని చేసేవారు ఉన్నారన్నారు. వీరంతా ఆధార్, పాన్, ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబరు కలిగి ఉండాలన్నారు. నమోదు ప్రక్రియను సేల్ఫ్ రిజిస్ట్రేషన్, సీఎస్‌సీ సెంటర్లు గ్రామ, వార్డు సచివాలయాల్లో చేసుకోవచ్చునని తెలిపారు. సదస్సులో హోటల్ యజమా నులు, ఇన్‌స్టాకార్ట్ సర్వీసెస్ సంస్థ వారు పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తుల అరెస్టు


వివరాలు తెలియజేస్తున్న సీఐ రోషన్, పక్కన ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దని మందలించినందుకు కక్ష కట్టి కత్తితో దాడి చేసి గాయ పరిచిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి నట్లు సీఐ రోషన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ప్రతాప్ రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. కమలాపురం టౌన్ ఇందిరమ్మకాలనీకి చెందిన షేక్ సల్మాన్ అనే వ్యక్తి తన బైకుపై అక్సనగర్ వీధుల్లో వేగంగా తిరు గుతుండగా.. అదే ఏరియాకు చెందిన షేక్ సోహైల్ అనే వ్యక్తి మందలించా డు. ఈ విషయం మనసులో పెట్టుకుని సల్మాన్ తన తండ్రి మహబూబ్ షరీఫ్‌తో కలిసి గత నెల 31న రాత్రి సోహై ల్ తన ఇంటి ముందు నిలబడి ఉండగా కత్తితో మెడపై పోడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమ యంలో విడిపించడానికి వెళ్లిన షబాజ్, రియా జ్‌లపై దాడి చేసి గాయ పరిచారు. ఈ కేసులోని నిందితులను బుధవారం ఉదయం ఎస్ఐ య్రుప్రతా ప్‌రెడ్డి సిబ్బందితో కలసి అరెస్టు చేశారన్నారు. నేరానికి ఉపయో గించిన కత్తితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు నీటిలో పడి గొర్రెల కాపరి మృతి


హృదయరాజు మృతదేహం

బద్వేలు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని కోనసముద్రం గ్రామ సమీ పంలోని బావిలో నీటిని తాగేం దుకు వెళ్లి ప్రమాదవశాత్తు పడి గొర్రెల కాపరి హృదయరాజు (32) మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరా లిలా.. బి.మఠం మండ లం టి.రామాపురం గ్రామానికి చెందిన హృదయరాజు కుటుంబీ కులు గొర్రెల కాపరులుగా జీవనం సాగిస్తున్నారు. బుధవారం కోన సముద్రం గ్రామ సమీ పంలో పొలాల్లో గొర్రెలు మేపుకుంటూ మధ్యాహ్న సమయంలో నీరు తాగేందుకు బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో గొర్రెలు మేపు తున్న సహచరులు బావి వద్దకు వెళ్లి చూడగా చెప్పులు, కర్ర బయటే ఉండ టంతో గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వారు బావి వద్దకు వచ్చి వెదకగా హృద యరాజు మృతదేహం బయట పడింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బద్వేలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి.. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా - ముగ్గురికి గాయాలు

కొండాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.సుగుమంచిపల్లె గ్రామ సమీపంలో బుధవారం సాయింత్రం ఆటో బోల్తా పడిన సంఘటనలో ముగ్గరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు మండలంలోని తిమ్మాపురం గ్రామం నుంచి తాడిపత్రికి వెళుతున్న ప్యాసింజర్ ఆటో సుగుమంచిపల్లెకు రాగానే ముందు టైరు పగిలింది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ కేశవతో పాటు, మరో ఇద్దరు పుల్లయ్య, ఓబులేసుకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ముగ్గురు క్రికెట్ బుకీల అరెస్టు

- రూ.55వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం ఆర్ట్ కాలేజీ కాంపౌండ్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు బుకీలను వన్‌టౌన్ ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.55 వేల నగదు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలి పారు. అరెస్టు అయిన క్రికెట్ బుకీల్లో ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన ఊట్ల మధుసూదన్ (45), దొరసానిపల్లె రోడ్డు కూల్‌డ్రింక్ షాపు చాకలి పెద్ద నరసింహులు (55), సూప ర్‌బజార్ రోడ్డుకు చెందిన మల్లెల నరసింహారెడ్డి (44) ఉన్నారు. వీరంతా ఐపీఎల్ లీగ్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహించి.. లావాదేవీలు పంచుకుం టుండగా అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంకా ఈ కేసులో మరికొంత మందిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు.

వేంపల్లెలో వరుస చోరీలు భయాందోళనలో ప్రజలు

వేంపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఇటీవల వరుసగా చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవతున్నారు. ఎక్కువగా చిల్లర దొంగతనాలు ప్రతిరోజు ఏదొకచోట జరుగుతూనే ఉన్నాయి. తాజాగా స్థానిక కడప రోడ్డులోని ఇందు ట్రావెల్స్ కార్యాలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారు. రూ.45వేలు నగదు తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. మెయిన్ బజార్‌లోని మెయిన్ స్కూల్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో 30 ప్యాకెట్ల కందిబేడలు, నాలుగు డబ్బాల పాల ప్యాకెట్లు గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారు. గత కొన్ని రోజులుగా పులివెందుల రోడ్డులోని పలు బంకుల్లో బీగాలు పగులగొట్టి లోపలున్న వస్తువులను చోరీ చేస్తున్నారు. పలువురు బాధితులు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసి.. వరుస దొంగతనాలను అరికట్టాలని కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మారుతీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మారుతీనగర్‌కు చెందిన పెయింటర్ బాబ్జి (36)తో భార్యకు మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆమె ముగ్గురు పిల్లలతో 5 సంవత్సరాల క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై బాబ్జి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి... కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పాత్రి కేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చక్రాయపేట, కమలాపురం, వేముల తదితర మండలాల్లో ఇప్పటికీ కరువుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం, అధికారులు వాస్తవాలు క్షేత్ర స్థాయిలో పునఃపరిశీలించి కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాగా, వక్ఫ్ బిల్లుకు కూటమి సర్కారు మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బండిజకరయ్య, ఎస్ఏ సత్తార్, సలావుద్దీన్, సిరాజుద్దీన్, సంజయ్ కాంత్. అశోక్ రెడ్డి, మామిళ్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

16న మత్స్య సహకార సంఘాల ఎన్నికలు

- ఎన్నికల షెడ్యూల్‌ను జారీ చేసిన కలెక్టర్

కడప రూరల్, ఏప్రిల్ 2: జిల్లాలో మత్స్య సహకార సంఘాల ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్) మంగళవారం ఎన్నికల షెడ్యూల్ జారీ చేశారు. ఈ నెల 16వ తేదీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని జీవీ సత్రం, నరసాపురం, బద్వేల్, చిన్నసింగనపల్లి, యర్రబల్లి మత్స్య సహకార సంఘాలకు నూతన పాలకవర్గ సభ్యులను (చేతులు ఎత్తు పద్ధతి ద్వారా) ఎన్నుకోనున్నారు. ఇందులో సంబంధిత మత్స్య సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన సభ్యులకు మాత్రమే ఓటు హక్కు కలిగి ఉంటారు. ఈ మేరకు మత్స్య సహకార ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలను చేపట్టిందని ఉప మత్స్య సంచాలకులు కె. శాంతి తెలిపారు.

కడప సీసీఎస్ సీఐగా కృష్ణమరాజునాయక్ బాధ్యతలు

కడప క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడప సీసీఎస్ పోలీసుస్టేషన్ సీఐగా కృష్ణం రాజు నాయక్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్ఐగా జిల్లాలోని పోరుమామిళ్ల, ప్రొద్దుటూరు త్రీటౌన్, రాజుపాలెం, పెద్దముడియం, ఎర్రగుంట్లలో విధులు నిర్వహించారు. 2024లో సీఐగా పదోన్నతి పొంది ముదిగుబ్బలో పనిచేశారు. అక్కడ నుంచి ఒంటిమిట్టకు బదిలీ అయ్యారు. ఒంటిమిట్ట నుంచి ప్రస్తుతం సీసీఎస్-1గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థిని అదృశ్యం



కడప క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పుష్పగిరి స్కూలు సమీపంలో సాంఘిక సంక్షేమ గిరిజన స్కూలులోని విద్యార్థిని అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. 7వ తరగతి చదువుతున్న యశోద బుధవారం ఉదయం 7గంటలకు హాస్టలు నుంచి బయటికి వచ్చి అదృశ్యమై నట్లు తెలిపారు. విద్యార్థినికి మతిస్థిమితం సరిగా లేదని స్కూలు ప్రిన్సిపల్ విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

వేప మండపాన్ని ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు



నేడు గంగమ్మ తల్లి జాతర

రాజంపేట టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతర గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం అమ్మవారికి వేప ఆకుల మండపాన్ని నిర్మించారు. అలాగే భక్తులు ఇబ్బంది పడకుండా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కడప జిల్లాలో రాజంపేట గంగమ్మతల్లి జాతరకు అత్యంత ప్రాముఖ్యత ఉండటంతో పట్టణ, మన్నూరు సీఐలు రాజా, కుళాయప్ప, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు ప్రసాద్‌రెడ్డి, నవీన్, మహేష్‌నాయుడు, రవిప్రకాష్‌రెడ్డి నేతృత్వంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సుండుపల్లె సంత వేలంపాట రూ.22.20 లక్షలు

సుండుపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె వారపుసంత వేలం పాటను బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించినట్లు డీఎల్‌పీవో మస్తాన్‌వలి తెలిపారు. సోమవారం కూరగాయల సంతను వెంకటరమణ రూ.15,75,000లకు, పశువుల సంతను గొడుగు నారాయణ రూ.6,45,000లకు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల అభివృద్ధికి పాటుపడాలి

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మాదిగల అభివృద్ధి కోసం పాటుపడాలని టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని కొత్తకోడూరు సమీపంలో ఏర్పాటు చేసిన మాదిగ అభ్యుదయ సేవా సంఘం నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మాదిగ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు రాజశేఖర్ మాదిగ, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటిస్తూ

వేతన సవరణ కమిషన్ నియమించాలి

● ప్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ప్యాప్టో చైర్మన్ షేక్ షబ్బీర్, సెక్రటరీ జనరల్ గఫార్‌ఖాన్ డిమాండ్ చేశారు. ప్యాప్టో రాష్ట్రశాఖ పిలుపు మేరకు బుధవారం మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ పార్ట్, ఫైనల్ పేమెంట్లు, సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిల చెల్లింపుల కోసం రూ.6500 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. 2004 సెప్టెంబరు 1 కన్నా ముందు వచ్చిన నోటిఫికేషన్‌తో నియామకమైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో నెంబర్ 57 ద్వారా ఉత్తర్వులు అమలు చేయాలని కోరారు. ప్యాప్టో జిల్లా చైర్మన్‌లు రవిశంకర్, సిబాతుర్ రెహమాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రకటించే డీఏలకు అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించడం ఒక విధానం అయితే ఆ క్రమంలో 3 డీఏలు, అదేవిధంగా ఇప్పటికే ప్రకటించి ఉన్న 5 డీఏ బకాయిలు సైతం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు. 2022 జూన్ నుండి పెండింగ్ ఉన్న సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్మెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ప్యాప్టో కార్యదర్శి సుధాకర్‌నాయుడు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, ఎస్‌టీయూ నాయకుడు సుబ్రమణ్యంరాజు, పీఈటీ అసోషియేషన్ నాయకులు రమేశ్, నరసరాజు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

రాయచోటి ఏరియా ఆసుపత్రికి

ట్రామా కేర్ సెంటర్ మంజూరు

● వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన బీజేపీ నేతలు



మంత్రి సత్యకుమార్‌ను కలిసి సమస్యలు వివరిస్తున్న రాయచోటి బీజేపీ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గంతో పాటు ఇతర నియోజకవర్గాల్లోని సుమారు 14 మండలాల ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న రాయచోటి ఏరియా ఆసుపత్రికి ట్రామా కేర్ సెంటర్ మంజూరు చేయడం హర్షణీయమని బీజేపీ నేత డాక్టర్ పాలగిరి శ్రీనివాసకుమార్‌రాజు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కడపకు వచ్చిన సందర్భంగా స్టేట్ గెస్ట్‌హౌస్‌లో బీజేపీ నేతలు డాక్టర్ శ్రీనివాస్‌కుమార్‌రాజు, రేవన శివప్రసాద్, లోకేశ్వర్మ తదితరులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాయచోటి ఏరియా ఆసుపత్రిని పరిశీలించి అక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ త్వరలోనే అవసరమైన మెరుగైన వైద్య సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

మంత్రి దృష్టికి నందలూరు సమస్యలు

నందలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను బుధవారం కడప పట్టణంలో కలిసి మండలంలోని సమస్యలను విన్నవించినట్లు బీజేపీ నాయకుడు పోతురాజు మస్తానయ్య పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ మారమ్మతల్లి దేవస్థాన సమస్యను మంత్రికి వివరించగా వెంటనే స్పందించి సమస్యపై కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో మాట్లాడటం జరిగిందని తెలిపారు. అలాగే మంత్రిని జాతరకు ఆహ్వానించినట్లు మస్తానయ్య తెలిపారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ



హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి రూ.లక్ష చెక్కును అందజేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): పోలీసు కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ గురుమూర్తి సతీమణికి బుధవారం రూ.లక్ష చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజంపేట సబ్ డివిజన్ పరిధిలోని పెనగలూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ 2002 బ్యాచ్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ నిరుకట్ల గురుమూర్తి ఈనెల 24వ తేదీన గుండెపోటుతో మరణించారన్నారు. ప్రభుత్వం నుండి వారి కుటుంబాలకు రావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఏదైనా సమస్య వచ్చినా, సహాయం కావాలన్నా తమ దృష్టికి తీసుకురావాలని మృతుడి భార్య అమరావతికి తెలిపారు. కార్యక్రమంలో ఏవో కృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నాగేంద్రప్రసాద్ సేవలు మరువలేనివి

నందలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె బాలికల జూనియర్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా డాక్టర్ మీసరగండ నాగేంద్రప్రసాద్ సేవలు మరువలేనివని రాష్ట్ర వ్యాయామ విద్య పరిశీలకుడు భానుమూర్తిరాజు పేర్కొన్నారు. బుధవారం ప్రధానోపాధ్యాయురాలు జయలిలత కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన పదవీవిరమణ సన్మాన కార్యక్రమంలో నాగేంద్రప్రసాద్, శ్రీదేవి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు పండితుడు, కవి గంగనపల్లె వెంకటమరణ, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు సుబ్రమణ్యంరాజు, రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం మాజీ అధ్యక్షుడు జీవీ నారాయణరెడ్డి, ఎంఈవోలు నాగయ్య అనంతకృష్ణ, రఘునాథ్‌రాజు, చక్రధర్‌రాజు, ప్రభాకర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి దేవుడు ఇచ్చిన వరం

సిద్దవటం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిలో పనిచేయడం దేవుడిచ్చిన వరమని ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు అన్నారు. మండల కేంద్రమైన సిద్దవటం జిల్లా పరిషత్ హైస్కూల్లో విధులు నిర్వహిస్తున్న కెమిస్ట్రీ ఉపాధ్యాయుడు రామలింగరాజు పదవీవిరమణ సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ రామలింగరాజు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అవార్డు దక్కించుకున్నారని కొనియాడారు. 36 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా వివిధ హోదాల్లో పనిచేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాన్యులకు న్యాయవాదులు అండగా ఉండాలి

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



చమర్తి జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న న్యాయవాదులు

రాజంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు న్యాయవాదులు అండగా ఉండాలని రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. బుధవారం రాజంపేట కోర్టు ఆవరణలో నూతనంగా ఎన్నికైన బార్‌కౌన్సిల్ అధ్యక్షుడు హనుమంతనాయుడు ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తిని న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయ వ్యవస్థ ఎంతో గొప్పదని, అలాంటి వ్యవస్థలో న్యాయవాద వృత్తి మహోన్నతమైనదన్నారు. కొన్ని కేసుల్లో ఇరుక్కున్న అమాయకులు కోర్టుల చుట్టూ తిరుగుతుంటారని, సామాన్యులకు అండగా ధర్మం వైపు నిలబడి ప్రతి న్యాయవాది న్యాయ వ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో బార్‌కౌన్సిల్ సభ్యులు, ప్రముఖ న్యాయవాదులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ల చొరవతో నీటి ఎద్దడి ఉన్న ప్రతి గ్రామంలో బోర్లు వేయించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు టీడీపీ యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఎంపీడీవో ఉషారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కిశోర్‌తో కలిసి దప్పేపల్లె గ్రామం కొండావాండ్లపల్లెలో పర్యటించారు. మంచినీటి పథకం బోరుకు అదనంగా 3 నుండి 5 పైపులు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

స్టాంప్ రైటర్ ఆత్మహత్య

రాయచోటిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చలపతివీధిలో నివాసం ఉంటున్న స్టాంప్ రైటర్ బండి రాజేశ్ (38) బుధవారం తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అర్బన్ సీఐ వెంకటచలపతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందులతోనే రాజేశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫారంపాండ్లతో నీటి సమస్య తగ్గుదల : పీడీ

చిన్నమండెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఫారంపాండు వల్ల రైతులకు నీటి సమస్యను తగ్గిస్తాయని, వేసవికాలంలో పశువులు, బర్రెల దాహార్తిని తీర్చుతాయని ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం అన్నారు. బుధవారం ఆయన మండలంలోని వండాడి పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న ఫారంపాండు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనిచేస్తున్న ఉపాధి కూలీలను, మస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈసీ సూర్యప్రకాశ్‌రెడ్డి, టీఏ మురళి, ఎఫ్‌ఏ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ కార్నర్ ఏర్పాటు

సిద్దవటం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సిద్దవటంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఓఆర్ఎస్ కార్నర్ ఏర్పాటు చేశామని వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఓఆర్ఎస్ కార్నర్‌లో ఎవరి అనుమతులు లేకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకోవచ్చునన్నారు. అలాగే జింక్ మాత్రలు, వాంతులు, విరేచనాల మాత్రలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ఈ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

● ఏపీజీబీ జనరల్ మేనేజర్ ఆర్.గిరి

రాజంపేట టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు లక్ష్యమని, అన్ని బ్యాంకుల కంటే డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తున్నామని ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఆర్.గిరి అన్నారు. రాజంపేటలో ఉన్న ఏపీజీబీ మెయిన్ బ్రాంచ్‌ను ఖాతాదారుల సౌకర్యార్థం మన్నూరు పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న అపార్టుమెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న నూతన భవనంలోనికి మార్పు చేసిన సందర్భంగా బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే రాజంపేట మెయిన్ బ్రాంచ్ వద్ద ఏటీఎం కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో రీజనల్ మేనేజర్ సుషాంత్‌కుమార్ స్వారో, రాజంపేట బ్రాంచ్ సీనియర్ మేనేజర్ కె.రాజేష్ బ్యాంకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీజీబీ మేనేజర్‌లు భాస్కర్‌రెడ్డి, సి.ప్రవీణ్‌కుమార్, దుశ్యంత్, నాగేశ్వర్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీరాములు, పుల్లంపేట బ్రాంచ్ మేనేజర్ ఎం.శ్రీనివాసన్, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్



బాధితులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. బుధవారం సీఎం సహాయనిధి చెక్కులను టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయి వికాష్‌రెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కోడూరు మండలంలో కంభం బాలసుబ్రహ్మణ్యంకు రూ.80,346, గడికోట చంద్రశేఖర్‌కు రూ.84,037, మేడా పిచ్చయ్యకు రూ.25,000, ఓబులవారిపల్లి మండలానికి చెందిన కోసూరి వెంకటరమయ్యకు రూ.36,560 చెక్కులను బాధితుల కుటుంబాలకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు పోతురాజు నవీన్, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, అరవింద్, చిన్న, సతీష్ పాల్గొన్నారు.

పశువుల నీటితొట్టి నిర్మాణానికి భూమిపూజ

పుల్లంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బావికాడపల్లె పంచాయతీ శ్రీకృష్ణమందిరం వద్ద నీటితొట్టి నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ భూమిపూజ చేశారు. వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్టిలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం అక్కడున్న గోకులాన్ని సందర్శించి గోవులకు మేత వేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, చంద్రశేఖర్‌నాయుడు, రాజానాయుడు, రెడ్డయ్యనాయుడు, ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కుల పంపిణీ

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వై.కోట అటవీ ప్రాంతంలో తలకోనకు వెళ్తున్న భక్తులపై ఏనుగులు దాడి చేసిన ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు రైల్వేకోడూరు రేంజర్ శ్యాంసుందర్ నష్టపరిహారం చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. మండలానికి చెందిన పలిగల రాజశేఖర్, టి.సిద్దయ్య, టి.చెంగమ్మలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5లక్షల చెక్కులను స్వయంగా బాధిత కుటుంబాలకు వెళ్లి అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10లక్షల నష్టపరిహారంలో ప్రకటించిన తక్షణమే రూ.5లక్షల చెల్లించిందని, మిగిలిన నష్టపరిహారం బుధవారం మృతుల కుటుంబ సభ్యులకు అందజేసినట్లు రేంజర్ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో జనార్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి : డీఎల్‌పీవో

ఒంటిమిట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో పారిశుధ్యంపై అధికారులు శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఒంటిమిట్టకు విచ్చేసిన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒంటిమిట్ట కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చిన 60మంది పంచాయతీ కార్యదర్శులు పది జోన్లుగా విడిపోయి 10రూట్లలో విధులు నిర్వహిస్తారన్నారు. ఒంటిమిట్టలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా, ప్లాస్టిక్ వస్తువులు కనిపించకుండా, పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఒంటిమిట్ట బస్టాండ్ పరిసర ప్రాంతాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో విజయభాస్కర్, ఏవో ఖాదర్‌బాషా, ఈవోపీఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తతో ఎరువులు తయారు చేయాలి

సుండుపల్లె, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువులుగా తయారు చేయాలని డీఎల్‌పీవో మస్తాన్ వలి తెలిపారు. బుధవారం సుండుపల్లె మండల కేంద్రానికి సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సహాయకులు, పంచాయతీ కార్మికులకు పారిశుధ్య నిర్వహణపైన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ప్రతి రోజు తడి చెత్తను సేకరించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేయాలన్నారు. అలాగే పొడి చెత్తను వారానికి ఒకసారి తప్పనిసరిగా తరలించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

● హౌసింగ్ ఏఈ చెంగయ్య

సిద్దవటం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం-1 ఎస్‌కేఆర్ నగర్, పార్వతీపురం గ్రామాల్లో 2019-21 సంవత్సరంలో మంజూరైన పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఏఈ చెంగయ్య తెలిపారు. బుధవారం ఆయన ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ పక్కా గృహాల పనులు త్వరగా పూర్తి చేయాలని, ఇందుకు అదనంగా లబ్ధిదారులకు రూ.50 వేలు మంజూరు చేశామని, జూన్ మాసం లోపు ప్రతిఒక్కరు పక్కాగృహాలను నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'అనుబంధం' సర్టిఫికెట్ తీసుకోవాలి : ఏఈ

రామాపురం, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు గ్రామ సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ వద్ద అనుబంధం సర్టిఫికెట్ తీసుకోవాలని హౌసింగ్ ఏఈ కేఎన్‌యం ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు సంబంధించిన రికార్డులు ఉన్నాయని, ఇంటికి సంబంధించి పట్టాలు త్వరగా చేసుకుని వస్తే వారికి వెంటనే పక్కా గృహాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కేంద్ర మంత్రి గడ్కరీతో సాయిలోకేశ్ భేటీ

రాజంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ బుధశారం ఢిల్లీలో కలిశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డితో కలిసి ఆయన మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కడప నుంచి రేణిగుంటకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిందని, దీనివల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే రోడ్డు మరమ్మతులు చేయాలని వినతిపత్రం అందజేశారు. అలాగే కడప-రేణిగుంటకు నాలుగులైన్ల రహదారి మంజూరై ఉందని, అయితే వాహనాల రద్దీ దృష్ట్యా దాన్ని ఆరు లైన్లకు మార్చాలని విన్నవించారు.



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం సమర్పిస్తున్న పురందేశ్వరి, రూపానందరెడ్డి, సాయిలోకేష్.

మామిడికి కవర్



మామిడి కాయకు రక్షణ కవర్

- రైతులకు కోటి కవర్ల పంపిణీ లక్ష్యం
- 50 శాతం సబ్సిడీతో...
- రైతుకు లాభం..వినియోగదారుడికి తియ్యని రుచులు

వేసవి వచ్చిందంటే మధురఫలం..మామిడి పండు రుచిచూడని వారుండరంటే అతిశయోక్తి కాదు. అటువంటి మామిడి పండు పూత నుంచి పిందె, కాయ, పక్వానికి వచ్చే సరికి 120 రోజులు పడుతుంది. చీడపీడలు, వాతావరణ పరిస్థితులను ఎదుర్కొని నిలిచిన మామిడి పండే మన నోటికి అందుబాటులోకి వస్తుంది. అటువంటి మామిడి పండు పరిరక్షణకు ఉద్యానశాఖ అధికారుల సహకారంతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ నేతృత్వంలో మామిడి కాయ పక్వ దశకు వచ్చే వరకు రక్షణ కవచంగా ప్రత్యేక కవర్ల విధానం అమలులోకి తీసుకొస్తున్నారు.

పురుగులతో మామిడికి దెబ్బ

మామిడిసాగులో పూత నుంచి పిందె దశకు వచ్చే వరకు 60 రోజుల సమయం పడుతుంది. జనవరిలో మొదలయ్యే పూత ఫిబ్రవరి ఆఖరుకు పిందె దశకు వస్తుంది. ఈ పిందె కోడి గుడ్డు సైజు వచ్చే సరికి ఊజి పురుగు దాడి చేస్తుంది. ఈ ఊజి పురుగు మామిడికాయపై చిన్నగా కాట్లు వేసి రంధ్రాలు చేసి అందులో గుడ్లను విడిచి పెడుతుంది. ఈ గుడ్లు కాయతో పాటు పెరిగి పురుగులు ఏర్పడి మామిడి పండును తినడానికి కూడా పనికిరాకుండా చేస్తాయి. అలాగే కాయ పక్వానికి వచ్చే దశలో గొంగళి పురుగు దాడి చేస్తుంది. కాయపై బొక్కలు పెట్టి, కాడ పలచబడేలా చేసి చెట్టు నుంచి కాయ కిందకు పడేలా చేసేస్తుంది. ఎర్రనల్లి, నల్లనల్లి పురుగు (త్రిప్స్) మామిడి కాయపై పొర కొరుకుతూ వాతలు పెడుతుంది. ఈ వాతలతో నల్లమచ్చలు ఏర్పడి మంగులా తయారవుతాయి. ఈ కాయలు తినడానికి కూడా పనికి రాకుండా పోతాయి. వీటికి అదనంగా ఎండ, వాన, గాలి తదితర వాతావరణ పరిస్థితులతో మామిడి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది.



మామిడిపండుపై గొంగళి పురుగు దాడి (ఫైల్)



ఎర్రనల్లి పురుగుదాడి చేయడంతో దెబ్బ తిన్న మామిడి పండు (ఫైల్)

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఎక్కువగా బేనీషా రకం మామిడి తోటలు సాగవుతున్నాయి. వీటితో పాటు జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో నీలం, ఇమామ్‌పసంద్, కేసరి రకం మామిడి తోటలు, జ్యూస్ ఫ్యాక్టరీకి తరలించే మామిడి బెంగళూరు రకం తోటలు కూడా సాగవుతున్నాయి. 1700 హెక్టార్లలో బేనీషా రకం మామిడి కాయల పరిరక్షణకు తొలివిడతగా ఉద్యానశాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా చైనా నుంచి దిగుమతి చేసుకున్న ప్రత్యేక సంచులను 50 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేయనున్నారు. మల్చింగ్ పేపర్ తరహాలో లోపల నల్లని కవరు, బయట మైనం కోటింగ్‌తో ఉండే ఈ సంచులు 20 సెంటీమీటర్ల వెడల్పు, 30 సెంటీ మీటర్ల పొడవు, 15కు 25 సెంటీమీటర్ సైజులతో రెండు రకాలుగా సంచులు తెప్పిస్తున్నారు. సంచి మొదట్లో జీఐ వైరు ఉండటం వలన కాయ మీద ఒత్తిడి లేకుండా కేవలం కాడతోనే జీఐ వైరు ఉండే సంచిని అమరుస్తారు.

50 శాతం సబ్సిడీతో కోటి సంచుల పంపిణీకి చర్యలు

జిల్లాలో మామిడి రైతులకు ప్రత్యేక సంచుల అవసరం గురించి ఉద్యానశాఖ విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. ఒక ఎకరాకు 4 టన్నులు (12 వేల కాయలు) లెక్కన ఈసారి సీజన్‌లో కోటి సంచులను రైతులకు పంపిణీ చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వాస్తవంగా ఈ సంచులు ఒక్కొక్కటి రూ.2.40 పైసలు ధరకు కొనుగోలు చేసి 50 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తారు. ఒక్కో సంచి రూ.1.20 పైసలు కొనుగోలు చేసే రైతులు వీటిని కాయలకు తొడిగేందుకు మరో కూలి రూ.1.20 ఖర్చు చేయాల్సి వస్తుంది. కేవలం ఒక్కో కాయకు రూ.4 వరకు మాత్రమే ఖర్చు వచ్చే క్రమంలో ఈ సంచులతో ఉపయోగాలు అనేకం ఉన్నాయి. దీంతో రైతులు వీటిపై పలుచోట్ల ఆరా తీస్తున్నారు.

ఆలస్యంగా మామిడి దిగుబడి

సాధారణంగా జిల్లాలో మామిడి సాగు జనవరి నుంచి మే వరకు సాగి మే నెలాఖరు జూన్ నెలల్లో మామిడి పండ్లు తినడానికి సిద్ధమవుతాయి. కాగా ఈసారి జనవరి నెలలో కొన్నిచోట్ల మామిడి పూత విరగ్గాసింది. కానీ ఎండ వేడిమికి పూత అంతా రాలిపోయి, ఒక నెల ఆలస్యంగా పక్వానికి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. అంటే సుమారు 20 రోజుల సీజన్ ఆలస్యమయ్యే సూచనలున్నాయి. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలతో పోలిస్తే మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో వాతావరణం చల్లగా ఉంటుంది. దీంతో ఈ ప్రాంతాల్లో ఆలస్యంగా మామిడి కోతలు పడతాయి. అంటే మరో 20 రోజుల్లో తూర్పు ప్రాంతాల్లో మామిడికాయలు కోడిగుడ్డు సైజుకు రానున్నాయి. ఆ తరువాతనే ప్రత్యేక సంచులను కాయలకు తొడుగుతారు. దీనిని బట్టి చూస్తే మరో 20 రోజుల్లో రాజంపేట, రైల్వేకోడూరు, తరువాత పీలేరు, రాయచోటి, మదనపల్లె ప్రాంతాల్లో కాయలకు ప్రత్యేక సంచులు కట్టనున్నారు.

ప్రత్యేక సంచులతో రక్షణ

మామిడి కాయలను పరిరక్షించడానికి ప్రత్యేకంగా తయారు చేసిన సంచులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ముఖ్యంగా ఊజి, గొంగళి, ఎర్రనల్లి, నల్లనల్లి పురుగుల దాడుల నుంచి ఈ సంచులు కాపాడతాయి. మామిడికాయ కోడిగుడ్డు సైజుకు వచ్చే సరికి ఈ సంచులను కాయలకు తొడుగుతారు. మామిడి కాయ కాడ ఆధారంగా సంచుల్లోనే పెరిగి పెద్దవి అవుతాయి. 60 రోజుల వరకు ఈ సంచులు రక్షణ కవచంలా ఉంటాయి. దీంతో పాటు కాయ పెరిగే సాధారణ సైజు కన్నా 10 శాతం అదనంగా బరువు పెరుగుతుంది. పురుగు మందులు మామిడికాయకు తగిలే అస్కారం లేకపోవడంతో ఆర్గానిక్ తరహా కాయలు మార్కెట్‌కు వస్తాయి. ఎండ నుంచి రక్షణ ఇవ్వడంతో పాటు ఎనిమిది గంటల ఏకధాటి వర్షానికి కూడా ఈ సంచులు తడవకుండా కాయకు రక్షణ కల్పిస్తాయి. 40 కిలోమీటర్ల వేగంతో వీచే గాలుల నుంచి కూడా కాయలు కిందపడకుండా కాడల ఆధారంగా ఈ సంచులు రక్షణ ఇస్తాయి. ఇన్ని విధాల రక్షణ కల్పించే మామిడి ప్రత్యేక సంచులకు త్వరలో డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది.



ప్రత్యేక సంచుల్లో పెరిగి ఎగుమతికి సిద్ధమైన మామిడి పండ్లు (ఫైల్)





కాయలకు తొడిగిన ప్రత్యేక సంచులు (ఫైల్)

ప్రణాళికాబద్ధంగా సంచులు తెప్పిస్తాం

జిల్లాలో మామిడి సాగు 20 నుంచి 30 రోజులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీని ఆధారంగా ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక సంచులు దిగుమతి చేయిస్తున్నాం. పాసుపుస్తకాలు ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీతో ఈ సంచులు అందిస్తాం. పాసుపుస్తకాలు లేని వారు బయట దుకాణాల్లో ఈ సంచులు కొనుగోలు చేసుకోవచ్చు. జిల్లాలో కోటి సంచుల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నాం.

- రవిచంద్రబాబు, ఉద్యాన శాఖ, జిల్లా అధికారి, రాయచోటి.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం స్వాధీనం



ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

కురబలకోట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ బండపల్లె సమీపంలో గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలో బండపల్లె సమీపంలో సర్వేనంబర్ 582లోని 79 సెంట్లలోని కొంత స్థలంలో ఆర్‌బీకే రోడ్డు నిర్మించారు. వాటికి పోగా మిగిలిన దాదాపు 30 సెంట్ల స్థలాన్ని కొంతమంది వైసీపీ నేతల అండతో ఆక్రమించు కున్నారు. ఈ విషయం స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో అధికారులు స్పందించారు. ఆక్రమణకు గురైన భూమిని ప్రభుత్వానికి చెందిన భూమిగా నిర్ధారిస్తూ రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తపస్విని మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా భూములను ఆక్రమించుకుని ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆ భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సుబ్రమణ్యం, వీఆర్వోలు ఖాదర్‌బాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోండి

- ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి కృష్ణయ్య

రాయచోటిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సమ్మర్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ విద్య జిల్లా అధికారి కృష్ణయ్య సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రారంభమైన సమ్మర్ క్లాసులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులతో ఈ నెల 1 నుంచి 23వ తేది వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సమ్మర్ క్లాసులు జరుగుతున్నాయన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచడమే కాకుండా వెనుకబడి ఉన్న విద్యార్థులను మరింత ముందుకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతో సమ్మర్ క్లాసులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ 24 నుండి మే 31వరకు వేసవి సెలవులు ఉంటాయని, జూన్ 2 నుండి తిరిగి కళాశాలలు ప్రారంభమవుతాయన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

కలికిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కలికిరి పంచాయతీలోని చిన్నమాలపల్లె దళితవాడలో బుధవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పలు శాఖలకు చెందిన అధికారులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు దళితుల హక్కని స్పష్టం చేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాస వర్మ, ఏసురాజు, తహసీల్దారు మహేశ్వరిబాయి, వీఆర్వోలు, గ్రామ పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.



కలికిరి చిన్నమాలపల్లె మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మహిళలు, అధికారులు

శ్మశానవాటికలో క్షుద్ర పూజలు...!

- ఆందోళనలో ఇందిరమ్మకాలనీ వాసులు

గుర్రంకొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్మశానం, పొలాల్లో కొన్ని రోజులుగా క్షుద్రపూజలు చేస్తుండంతో ఇందిరమ్మకాలనీ, జగనన్న కాలనీ వాసులు ఆందోళనకు గురవుతున్నారు. కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు బయటి ప్రాంతాల నుంచి మాంత్రికులను పిలిపించి పూజలు చేయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

గుర్రంకొండ పట్టణానికి సమీపంలోని ఇందిరమ్మకాలనీలో 650 కుటుంబాలు, జగనన్న కాలనీలో 300 కుటుంబాలు ఉన్నాయి. ఈ కాలనీలో ఇళ్లను నిర్మించుకున్న పలువురు వాటిని ఇతరులకు బాడుగకు ఇచ్చారు. మరి కొందరు ఇళ్లను అమ్ముకోవడంతో బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు కొనుగోలు చేసి నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు కాలనీల్లో ఎక్కువ శాతం బయటి ప్రాంతాలకు చెందిన వ్యక్తులే ఉన్నారు. వీరిలో కొందరు నేరచరిత్ర కలిగిన వారు ఉన్నట్లు కాలనీ వాసులు గుసగుసలాడుతున్నారు. కాగా, కాలనీలో ఉన్న కొందరు వ్యక్తులు గుప్త నిధులు, క్షుద్ర పూజల ముఠాలను పిలిపించి చుట్టు పక్కల ప్రాంతాల్లో క్షుద్రపూజలతో పాటు తవ్వకాలు చేస్తున్నట్లు కాలనీ వాసులు చర్చించుకుంటున్నారు. ఇలాంటి వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ మధు రామచంద్రుడు మాట్లాడుతూ గుర్రంకొండ ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో పోలీస్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, కొత్త వ్యక్తుల వివరాలను సేకరించి చర్యలు తీసుకుంటామన్నారు.



క్షుద్ర పూజలు చేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్న ప్రాంతం, వినియోగించిన వస్తువులు


అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బి.కొత్తకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని పశువుల ఆసుపత్రి సమీపంలో నివాసం ఉంటున్న తమ్మిశెట్టి రత్నమయ్య (30) బుధవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో సీలింగ్ ఫ్యానుకు తన పంచెతో ఉరి వేసుకున్నాడు. కుటుంబీకులు గమనించే లోపే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి వెంకట్రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న రత్నమయ్య

రక్షణ కోరిన ప్రేమజంట



పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రేమజంట

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెద్దల నుంచి రక్షణ కల్పించాలంటూ ఓ జంట బుధవారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన సిసింద్రీ (23) కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, మదనపల్లె మండలం, బోడు మోళ్లదిన్నెకు చెందిన శ్రావణి (22) డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటుంది. డిగ్రీ చదువుకునే రోజుల్లో వారు ప్రేమించుకున్నారు. కులాలు వేరు కావడంతో ఇరువురి తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో ఇటీవలే ఇంట్లో నుంచి వెళ్లిపోయి ప్రేమవివాహం చేసుకున్నారు. అనంతరం రక్షణ కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. తన కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందంటూ శ్రావణి తన ఫిర్యాదులో పేర్కొంది. ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు రప్పించి కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉండాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో జేసీ, సబ్‌కలెక్టర్

రాజంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అధికారులు రెవెన్యూ చట్టాలు, మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ ఆడిటోరియంలో డివిజన్‌స్థాయి రెవెన్యూ అధికారుల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు బాధ్యతాయుతంగా జవాబుదారితనంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అసైన్‌మెంట్ భూములపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యవస్థలో లోపాలు సరిద్దిద్దుకొని ముందుకు వెళ్లినప్పుడే పనితీరు మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్ మాట్లాడుతూ రెవెన్యూ అంశాలలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను బాధ్యాతయుతంగా పూర్తి చేయాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో నిబంధనలు పాటించాలన్నారు. సబ్‌కలెక్టర్ నిదియాదేవి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల నిర్వాహకుల నుంచి డ్రైవింగ్ శిక్షణా కేంద్రాల ఏర్పాటు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్లు, విద్యాసంస్థల ప్రతినిధులు, ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటు కోసం అనుమతులు ఇస్తోందన్నారు. ఈ కేంద్రాలు ఏర్పాటు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కింద ఆర్థిక సహాయం కూడా చేస్తుందని తెలిపారు. జిల్లాలో ఎవరైనా అర్హత ప్రమాణాలతో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్

రుణ ప్రణాళికను సక్రమంగా నమోదు చేయాలి

వీరబల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సభ్యుల జీవనోపాదులు, కుటుంబ అవసరాల రుణ ప్రణాళికలు సక్రమంగా నమోదు చేయాలని జిల్లా జీవనోపాధుల ప్రాజెక్టు మేనేజర్ గంగార్జున, ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన వీవోఏలు, ఎన్యుమరేటర్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 660 స్వయం సహాయక సంఘాలకు గానూ ప్రతి 6 సంఘాలకు ఒక ఎన్యుమరేటర్ చొప్పున 106 మందికి శిక్షణ ఇచ్చి సంఘాల సభ్యులందరితో ముఖాముఖి చర్చించి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్‌వలి, సీసీలు నాగేంద్ర, కృష్ణయ్య, సుధాకర్, గంగాధర్ పాల్గొన్నారు.

జనసేన నేతపై దాడికి యత్నం

వీరబల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జనసేన మండల కన్వీనర్, వార్డు మెంబర్ గుగ్గిళ్ల వెంకటేష్‌పై సానిపాయి సర్పంచ్ నేతి ఆంజనేయులు, వారి కుటుంబ సభ్యులు మారణాయుధాలతో దాడికి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. అయితే వెంకటేష్ త్రుటిలో తప్పించుకొని పారిపోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడన్నారు. గతంలో సర్పంచ్ దాదాపు రూ.26 లక్షల అవినీతి చేసినట్లు కలెక్టరుకు తాను ఫిర్యాదు చేయడంతోనే తనపై కక్ష పెంచుకొని ఇలా దాడికి యత్నించినట్లు బాధితుడు తెలిపాడని అంటున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి విచారించారు. కాగా రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, జనసేన రాజంపేట నియోజకవర్గ సమన్వయకర్త దినేశ్ బాధితుడిని పరామర్శించారు.

యూట్యూబర్స్‌పై కేసు నమోదు

రైల్వేకోడూరురూరల్‌ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇద్దరు యూట్యూబర్స్, మరొక విలేకరి (ఆంధ్రజ్యోతి కాదు)పై సీఐ కె.హేమసుందర్ బుధవారం కేసు నమోదు చేశారు. యూట్యూబర్స్ ముప్పాల శంకర్‌రాజు, సత్యనారాయణ రెడ్డి, విలేకరి గూడూరు సుబ్రహ్మణ్యం రాజు తన విధులకు ఆటంకం కలిగించి, తప్పుడు వార్తలు ప్రచురించి, డబ్బుల కోసం బెదిరించారని కోడూరు రేంజర్ పీఏ శ్యాంసుందర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి

- ఎంపీ మిథున్‌రెడ్డి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఒంటిమిట్టలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన రైల్వేబోర్డు ఛైర్మన్ సతీష్, కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు లేఖ రాశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు కోదండరాముడి దర్శనానికి వస్తారని, వారి సౌకర్యార్థం ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో తిరుమల, వెంకటాద్రి, రాయలసీమ, గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని లేఖలో పేర్కొన్నారు.

ఘర్షణలో వృద్ధుడికి గాయాలు

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భూ వివాదం కారణంగా జరిగిన ఘర్షణలో ఓ వృద్ధుడు గాయపడినట్లు ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు. పీటీఎం మండలం, రాఘూరివారిపల్లె గ్రామం, కొత్తపల్లెకు చెందిన యర్రంరెడ్డి కుమారుడు రామకృష్ణారెడ్డి (74)కు డి.నారాయణపల్లె వద్ద నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో తమకు భాగం ఉందని రామకృష్ణారెడ్డికి వరుసకు మనుమళ్లు అయిన ప్రతాప్‌రెడ్డి, శబరీష్‌రెడ్డిలు బుధవారం పొలం వద్ద ఘర్షణ పడ్డారు. ఈ గొడవలో రామకృష్ణారెడ్డి తలపై వారు కర్రతో దాడి చేశారు. దీంతో గాయపడిన వృద్ధుడిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పీటీఎం ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులపై గతంలో కూడా కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

ఒంటిమిట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపల్లె గ్రామానికి చెందిన గోపినేని మహేశ్వరి మెడలో ఉన్న బంగారు గొలుసు (సరుడు)ను దొంగ లాక్కొనిపోయినట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మహేశ్వరి బుధవారం ఉదయం ఆమె తల్లితో కలిసి గేదెలను మేపుకొనేందుకు అడవికి వెళ్లారు. తల్లి అడవి లోపలికి వెళ్లడంతో మహేశ్వరి ఇంటికి బయలుదేరింది. దారిలో వర్మీకంపోస్టు డంపింగ్ యార్డు వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి తన మెడలోని తాలిబొట్టు సరుడును లాక్కొనేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో దొంగ కత్తి చూపించి భయపెట్టి బంగారు సరుడును లాక్కొని వెళ్లిపోయినట్లు తెలిపారు. సరుడు 3 తులాలు ఉంటుందని, బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతా...గందరగోళం

- జీవనోపాధికి ఇచ్చిన పౌల్ట్రీ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు
- అధికారుల వద్ద రెండు రకాల జాబితాలు
- దిక్కుతోచని స్థితిలో అధికారులు
- దుర్వినియోగమైన స్థలాల స్వాధీనంలో మీనమేషాలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ భూములను పరిరక్షించుకోవడం అంత సులువు కాదనిపిస్తోంది. కొంతమంది కార్యాలయ సిబ్బంది సహకారంతో ఏకంగా ఫైళ్లు తారుమారు చేసినట్లు స్పష్టం అవుతోంది. దీంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నా ఫైళ్లన్నీ గందరగోళంగా ఉన్నాయి. ఈ క్రమంలో వారు పెద్దగా ఆసక్తిచూపకపోవడతో ఆక్రమించిన వారివే ఆస్తులు అనే విధంగా పరిస్థితులు తయారయ్యాయి. అక్రమార్కులు ఇచ్చే ముడుపులకు ఆశపడి కొంతమంది సిబ్బంది వివిధ సందర్భాలాల్లో ఎస్సీ కార్పొరేషన్ కార్యాల యంలోని రికార్డులను ట్యాంపరింగ్ చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతు న్నాయి.


పౌల్ట్రీస్థలంలో విచారణ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ (ఫైల్)

జీవనోపాధికి అవకాశం ఇస్తే...

కోళ్ల (ఫౌల్ట్రీ) పరిశ్రమ ద్వారా ఎస్సీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో 1984-85 సంవత్సరంలో ఉమ్మడి కడప జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టారు. కొంతకాలం బాగానే ఉన్నప్పటికి కాలక్రమేణా అవి శిధిలావస్థకు చేరుకున్నాయి. వీటిల్లో రాజంపేట మండలలోని తాళ్లపాక వద్ద నిర్మాణం చేసిన పౌల్ట్రీ కాంప్లెక్స్ కడప-తిరుపతి ప్రధాన దారి పక్కనే ఉండడం వల్ల లబ్ధిదారుల్లోని కొంతమంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీనికి ఎవరూ అడ్డుచెప్పకపోవడంతో నిర్మాణాలు జోరందుకున్నాయి. ఇంతలో ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు ఏర్పాటు కావడంతో ఇళ్లస్థలాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం అక్కడ సెంటు స్థలం రూ.12లక్షలు నుంచి రూ.15లక్షలు వరకు ధర పలుకుతోంది. ఇదే అదునుగా భావించిన లబ్ధిదారుల్లోని కొంతమంది ఎస్సీ కార్పొరేషన్ పౌల్ట్రీ స్థలాన్ని వ్యాపారానికి తెరలేపారనేది సమాచారం. అక్కడ తాము ఆక్రమించుకున్న స్థలంలో కొంతభాగాన్ని విక్రయంచగా వచ్చిన సొమ్ముతో విలాసవంతంగా భవనాలు నిర్మించుకుంటున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎస్సీ కార్పొరేషన్‌లోని కొంతమంది సిబ్బంది కూడా పరోక్షంగా లబ్ధిపొందినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో లబ్ధిదారుల జాబితా కూడా ట్యాంపరింగ్‌కు సిబ్బంది పాల్పడినట్లు సమాచారం.

రెండు జాబితాలు.. ఏదీ వాస్తవం

పౌల్ట్రీ లబ్ధిదారుల జాబితాలో గందరగోళం ఏర్పడింది. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలోనే రెండు రకాల జాబితాలు ఉంటున్నాయి. ఒక జాబితాలో 2019వ సంవ త్సరంలో అప్పటి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మురళీమనోహర్ సంతకం చేసిన జాబితాలో 30 మంది లబ్ధిదారుల పేర్లు ఉన్నాయి. కానీ ఇపుడు మాత్రం తెరపైకి 20 మంది పేర్లతో ఉన్న జాబితా వస్తోంది. ఈ రెండు జాబితాలో ఏది వాస్తవం అనేది అర్థం కాని పరిస్థితి. ఎస్సీలలోనే ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తుల పేర్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. 1984-85 సంవత్సరాలలో రూపొందించిన జాబితలో ఎక్కడ ఉండేది ఎవరికి తెలియని పరిస్థితి కనిపిస్తుంది. ఇదిలా ఉంటే 2019లో ఈడీ మురళీమనోహర్ సంతకంతో ఉన్న జాబితాను పరిగణలోకి తీసు కుంటారా లేకుంటే ఏ అధికారి సంతకం లేని 20 మంది పేర్ల జాబితాను పరి గణలోకి తీసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎందుకంటే ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో లబ్ధిదారుల జాబితా అడిగతే 20 మంది పేర్లు ఉన్న జాబితానే ఇస్తున్నారు. పౌల్ట్రీ కాంప్లెక్స్‌లో మొదటి నుంచి ఉపాధి పొందిన వారిలో కొంతమంది కాంప్లెక్స్ శిధిలావస్థలకు చేరుకోవడంతో వదిలిపెట్టారు. కానీ ఇపుడు మాత్రం అధికారులు తిరిగి పౌల్ట్రీస్థలాన్ని పరిశీలిస్తుండడంతో జాబితాలో తమ పేర్లు ఉన్నాయంటూ కొంతమంది లబ్ధిదారులు వెలుగులోకి వస్తున్నారు. కానీ నూతనంగా రూపొందించిన జాబితాలో మాత్రం 20 పేర్లు మాత్రమే ఉండడం అనుమానం కలిగిస్తోంది. దీంతో తమ పేర్లు అధికారిక జాబితాలో ఉన్నాయా లేదా అనే ఆందో ళన కొంతమంది లబ్ధిదారుల్లో నెలకొంది. అధికారులు సైతం ఈ అంశంపై దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు సమాచారం.

స్థలాల స్వాధీనంలో మీనమేషాలు

వాస్తవానికి ఎస్సీ కార్పొరేషన్ కేవలం జీవనోపాధుల కల్పన కోసమే కాంప్లెక్స్ కట్టిం చారు. అయితే అవి కూలిపోయి నిరుపయోగంగా మారడంతో పాటు ఆక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో తమ భూములు స్వాధీనం చేసుకునే దిశగా అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. కానీ తమ భూములు హద్దులు చూపడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు చర్చ సాగుతుంది. ఈ విషయాలపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అన్ని రికార్డులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి : డీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. బుధ వారం చెన్నూరు గ్రామ పంచాయతీలో పంచాయతీలో ఘన, వ్యర్థాల నిర్వహణపై క్లాప్ (గ్రీన్‌అంబాసిడర్స్) మిత్రులు, పంచాయతీ కార్యద ర్శులకు ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచ్ ఎస్.వెంకట సుబ్బయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా డీపీవో మాట్లాడుతూ భూమిపై ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు వేసి భూశక్తిని నాశనం చేయవద్దన్నారు. ప్రతి షాపుల్లోవాడే ప్లాస్టిక్‌ను పరిశీలించాలని.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అమ్మ కుండా చేయాలన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్ర మిస్తే కేసులు నమోదు చేసే అధికారం పంచాయతీకి ఉందన్నారు. పారిశుధ్యంపై ఫిర్యాదులు రాకూడద న్నారు. జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ మాట్లాడుతూ గ్రామ పంచా యతీల్లో నీరు, పారిశుధ్యం నిర్వహణ ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం చెన్నూరులోని ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించి పంచాయతీలో సేకరించిన వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాను పరిశీలించారు. అలాగే వానపాముల ఎరువు ఎలా తయారు చేస్తున్నారు, రైతులకు ఎంతకు అమ్ముతున్నారని ఈవోపీఆర్‌డీని అడిగి తెలుసుకున్నారు.

రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ బిల్

- మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా


మాట్లాడుతున్న అంజాద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్ర జ్యోతి): రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా కేంద్రం లోక్‌సభలో వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ 2025 బిల్లును తీసు కువచ్చిందని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాష తెలిపారు. దీనికి పార్లమెంటులో టీడీపీ ఎంపీలు మద్ద తు పలకడం బాధాకరమన్నారు. బుధవారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ముస్లిం మైనార్టీ వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా ఈ బిల్లును ప్రవేశపెట్టారని ఆరోపించారు. 1954లో వక్ఫ్ చట్టం మన దేశంలో అమలులోకి వచ్చిందన్నారు. ప్రధాని మోడీ దుర్మార్గమైన పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం మతాలను కులాలను చీల్చాలని చూడడం దారుణమన్నారు. ఈబిల్లుకు పార్ల మెంటులో కూటమి ప్రభుత్వం మద్దతు ఇవ్వడం బాధాకరమన్నారు. మాజీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాం, కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్


గ్రామ సచివాలయం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రాల సముదాయాలను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య సంరక్షణ కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ప్రొద్దుటూరు నియోజకవర్గం కొత్తపల్లె పంచాయతీ కానపల్లెలో గ్రామ సచివాలయం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రాల సముదాయాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల ఆరోగ్య సంరక్షణ కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తోందన్నారు.ప్రజా ఆరోగ్య సంరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 3,260 హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్న తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్, ఉపాధి హామీ నిధులను పక్కదారి పట్టించడంతో పల్లెసీమలు అభివృద్ధికి దూరంగా ఉండిపోయాయన్నారు. దశాబ్దాల కాలంగా కడప పార్లమెంటు, ఒక అసెంబ్లీ నియోజకవర్గం ఒకే కుటుంబం చేతిలో ఉండిపోయాయని ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పదవులు వెలుగబెట్టినా కనీసం సొంత జిల్లా అభివృద్ధి నామమాత్రమే అన్నారు. గండికోట జలాలకు సంబంధించి పిల్ల కాలువలు తవ్వడం, అన్నమయ్య డ్యాం తెగిపోవడం, కడప స్టీల్‌ప్లాంట్‌కు నాలుగుసార్లు భూమి పూజ చేసి చెల్లికి జరగాలి పెళ్లి మళ్లీ మళ్లీ అన్న చందంగా పరిపాలన సాగిందని ఆయన విమర్శించారు.

ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పీ4 విధానాన్ని అమలుపరిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు దుర్మార్గమైన పాలనను తరిమికొట్టి అభివృద్ధి చేసే కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చెప్పారు. జిల్లాతోపాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి సుముఖంగా ఉన్నారని చెప్పారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘ జిల్లా అధ్యక్షుడు, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుబ్బిరెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి, కొత్తపల్లె ఎంపీటీసీ గోపాల్, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ప్రొద్దుటూరు తహసీల్దారు గంగయ్య, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ ఉపకమిషనర్ శ్రీకాంత్‌నాయక్

కడప(వినాయకనగర్), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్మికుడు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కార్మికశాఖ ఉపకమిషనర్ శ్రీకాంత్‌నాయక్ పేర్కొన్నారు. జిల్లాలోని గిగ్ ప్లాట్ ఫాం వర్కర్లకు అవగాహన సదస్సును బుధవారం ఎన్జీవో కాలనీలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 600 మంది ప్లాట్‌ఫాం వర్కర్స్ జుమాటో, స్విగ్గి, ఓలా, ఉబర్ రాపిడో వంటి వాటిలో పని చేసేవారు ఉన్నారన్నారు. వీరంతా ఆధార్, పాన్, ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబరు కలిగి ఉండాలన్నారు. నమోదు ప్రక్రియను సెల్ఫ్ రిజిస్ట్రేషన్, సీఎస్‌సీ సెంటర్లు గ్రామ, వార్డు సచివాలయాల్లో చేసుకోవచ్చునని తెలిపారు. సదస్సులో హోటల్ యజమా నులు, ఇన్‌స్టాకార్ట్ సర్వీసెస్ సంస్థ వారు పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తుల అరెస్టు


వివరాలు తెలియజేస్తున్న సీఐ రోషన్, పక్కన ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దని మందలించినందుకు కక్ష కట్టి కత్తితో దాడి చేసి గాయ పరిచిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి నట్లు సీఐ రోషన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ప్రతాప్ రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. కమలాపురం టౌన్ ఇందిరమ్మకాలనీకి చెందిన షేక్ సల్మాన్ అనే వ్యక్తి తన బైకుపై అక్కనగర్ వీధుల్లో వేగంగా తిరు గుతుండగా.. అదే ఏరియాకు చెందిన షేక్ సోహైల్ అనే వ్యక్తి మందలించా డు. ఈ విషయం మనసులో పెట్టుకుని సల్మాన్ తన తండ్రి మహబూబ్ షరీఫ్‌తో కలిసి గత నెల 31న రాత్రి సోహై ల్ తన ఇంటి ముందు నిలబడి ఉండగా కత్తితో మెడపై పోడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమ యంలో విడిపించడానికి వెళ్లిన షబాజ్, రియా జ్‌లపై దాడి చేసి గాయ పరిచారు. ఈ కేసులోని నిందితులను బుధవారం ఉదయం ఎస్ఐ యు.ప్రతా ప్‌రెడ్డి సిబ్బందితో కలసి అరెస్టు చేశారన్నారు. నేరానికి ఉపయో గించిన కత్తితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు నీటిలో పడి గొర్రెల కాపరి మృతి


హృదయరాజు మృతదేహం

బద్వేలు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనసముద్రం గ్రామ సమీ పంలోని బావిలో నీటిని తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు పడి గొర్రెల కాపరి హృదయరాజు (32) మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరా లిలా.. బి.మఠం మండలం టి.రామాపురం గ్రామానికి చెందిన హృదయరాజు కుటుంబీ కులు గొర్రెల కాపరులుగా జీవనం సాగిస్తున్నారు. బుధవారం కోన సముద్రం గ్రామ సమీపంలో పొలాల్లో గొర్రెలు మేపుకుంటూ మధ్యాహ్న సమయంలో నీరు తాగేందుకు బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో గొర్రెలు మేపుతున్న సహచరులు బావి వద్దకు వెళ్లి చూడగా చెప్పులు, కర్ర బయటే ఉండటంతో గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వారు బావి వద్దకు వచ్చి వెదకగా హృద యరాజు మృతదేహం బయట పడింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బద్వేలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా - ముగ్గురికి గాయాలు

కొండాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.సుగుమంచిపల్లె గ్రామ సమీపంలో బుధవారం సాయింత్రం ఆటో బోల్తా పడిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు మండలంలోని తిమ్మాపురం గ్రామం నుంచి తాడిపత్రికి వెళుతుతున్న ప్యాసింజర్ ఆటో సుగుమంచిపల్లెకు రాగానే ముందు టైరు పగిలింది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ కేశవతో పాటు, మరో ఇద్దరు పుల్లయ్య, ఓబులేసుకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ముగ్గురు క్రికెట్ బుకీల అరెస్టు

- రూ.55వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం ఆర్ట్ కాలేజీ కాంపౌండ్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు బుకీలను వన్‌టౌన్ ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.55వేల నగదు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలి పారు. అరెస్టు అయిన క్రికెట్ బుకీల్లో ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన ఊట్ల మధుసూదన్ (45), దొరసానిపల్లె రోడ్డు కూల్‌డ్రింక్ షాపు చాకలి పెద్ద నరసింహులు (55), సూప ర్‌బజార్ రోడ్డుకు చెందిన మల్లెల నరసింహారెడ్డి (44) ఉన్నారు. వీరంతా ఐపీఎల్ లీగ్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహించి.. లావాదేవీలు పంచుకుం టుండగా అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంకా ఈ కేసులో మరికొంత మందిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు.

వేంపల్లెలో వరుస చోరీలు భయాందోళనలో ప్రజలు

వేంపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఇటీవల వరుసగా చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవతున్నారు. ఎక్కువగా చిల్లర దొంగతనాలు ప్రతిరోజు ఏదొకచోట జరుగుతూనే ఉన్నాయి. తాజాగా స్థానిక కడప రోడ్డులోని ఇందు ట్రావెల్స్ కార్యాలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారు. రూ.45వేలు నగదు తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. మెయిన్ బజార్‌లోని మెయిన్ స్కూల్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో 30 ప్యాకెట్ల కందిబేడలు, నాలుగు డబ్బాల పాల ప్యాకెట్లు గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారు. గత కొన్ని రోజులుగా పులివెందుల రోడ్డులోని పలు బంకుల్లో బీగాలు పగులగొట్టి లోపలున్న వస్తువులను చోరీ చేస్తున్నారు. పలువురు బాధితులు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసి.. వరుస దొంగతనాలను అరికట్టాలని కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మారుతీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మారుతీనగర్‌కు చెందిన పెయింటర్ బాబ్జి (36)తో భార్యకు మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆమె ముగ్గురు పిల్లలతో 5 సంవత్సరాల క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై బాబ్జి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి... కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పాత్రి కేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చక్రాయపేట, కమలాపురం, వేముల తదితర మండలాల్లో ఇప్పటికీ కరువుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం, అధికారులు వాస్తవాలు క్షేత్ర స్థాయిలో పునఃపరిశీలించి కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాగా, వక్ఫ్ బిల్లుకు కూటమి సర్కారు మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బండిజకరయ్య, ఎస్‌ఏ సత్తార్, సలావుద్దీన్, సిరాజుద్దీన్, సంజయ్ కాంత్. అశోక్ రెడ్డి, మామిళ్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

16న మత్స్య సహకార సంఘాల ఎన్నికలు

- ఎన్నికల షెడ్యూల్‌ను జారీ చేసిన కలెక్టర్

కడప రూరల్, ఏప్రిల్ 2: జిల్లాలో మత్స్య సహకార సంఘాల ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్) మంగళవారం ఎన్నికల షెడ్యూల్ జారీ చేశారు. ఈ నెల 16వ తేదీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని జీవీ సత్రం, నరసాపురం, బద్వేల్, చిన్నసింగనపల్లి, యర్రబల్లి మత్స్య సహకార సంఘాలకు నూతన పాలకవర్గ సభ్యులను (చేతులు ఎత్తు పద్ధతి ద్వారా) ఎన్నుకోనున్నారు. ఇందులో సంబంధిత మత్స్య సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన సభ్యులకు మాత్రమే ఓటు హక్కు కలిగి ఉంటారు. ఈ మేరకు మత్స్య సహకార ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలను చేపట్టిందని ఉప మత్స్య సంచాలకులు కె. శాంతి తెలిపారు.

కడప సీసీఎస్ సీఐగా కృష్ణమరాజునాయక్ బాధ్యతలు

కడప క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడప సీసీఎస్ పోలీసుస్టేషన్ సీఐగా కృష్ణం రాజు నాయక్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్ఐగా జిల్లాలోని పోరుమామిళ్ల, ప్రొద్దుటూరు త్రీటౌన్, రాజుపాలెం, పెద్దముడియం, ఎర్రగుంట్లలో విధులు నిర్వహించారు. 2024లో సీఐగా పదోన్నతి పొంది ముదిగుబ్బలో పనిచేశారు. అక్కడ నుంచి ఒంటిమిట్టకు బదిలీ అయ్యారు. ఒంటిమిట్ట నుంచి ప్రస్తుతం సీసీఎస్-1గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

మెడిసిన్, నర్సింగ్ విద్యార్థులకు బాసట సాయం

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బాసట స్వచ్ఛంద సేవా సంస్థ కడప నగరానికి చెందిన మెడిసిన్, నర్సింగ్ విద్యార్థులకు రూ.50వేలు ఆర్థిసాయం చెక్కుల రూపంలో బుధవారం అందించారు. రేణిగుంట సమీపంలోని బాలాజీ మెడికల్ కళాశాలలో మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతున్న లోకేష్‌కి సెమిస్టర్ ఫీజుల నిమిత్తం రూ.30వేలు, కడప విజయదుర్గ నర్సింగ్ కళాశాలలో చదువుతున్న సౌభాగ్యకి రూ.20వేలు అవసరం ఉందని, ఇందులో దాతల నుంచి రూ.10232 విరాళాలు రాగా మిగతా రూ.39,768 బాసట కీలక సభ్యులైన కార్తీక్‌రెడ్డి, ధరణి అందజేశారు.

విద్యార్థిని అదృశ్యం



కడప క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పుష్పగిరి స్కూలు సమీపంలో సాంఘిక సంక్షేమ గిరిజన స్కూలులోని విద్యార్థిని అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. 7వ తరగతి చదువుతున్న యశోద బుధవారం ఉదయం 7గంటలకు హాస్టలు నుంచి బయటికి వచ్చి అదృశ్యమై నట్లు తెలిపారు. విద్యార్థినికి మతిస్థిమితం సరిగా లేదని స్కూలు ప్రిన్సిపల్ విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

వడదెబ్బపై అవగాహన అవసరం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బపై ప్రజలకు అవగాహన అవసరం అని ఆరోగ్యవిద్యాధికారి మహమ్మద్‌రఫీ, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లాఖాన్ తెలిపారు. బుధవారం నీరుగట్టువారిపల్లె సచివాలయం పరిధిలోని గజ్జల కుంట, అప్పా రావువీధి, అప్పా రావు తోటలోని ప్రజలకు వడదెబ్బ, ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించారు. ఎండలో ఎక్కువ సమయం ఉండడం వలన మెదడులో ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్రం దెబ్బతింటుందన్నారు. అలాంటి సమయంలో ప్రథమ చికిత్స అందకపోతే చనిపోయే ప్రమాదం ఉందన్నారు. గర్భిణులు, బాలింతలు, 10 ఏళ్లలోపు పిల్లలు, 60 ఏళ్ల పైబడిన వృద్ధులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం నీళ్లు నిల్వ చేసే డ్రమ్ములు, తొట్టెలు, ఖాళీ చేసి ఎండకు ఆరబెట్టాలని సూచించారు. ప్రతి గంటకు ఒక గ్లాసు నీరు తాగాలన్నారు. ఉదయం 11 గంటల వరకు సాయంత్రం 4 గంటల పైన రైతులు, కార్మికులు పనులు చేసుకోవాలన్నారు. శానిటరీ కార్య దర్శులు రెడెప్ప, బాలాజీ, మహమ్మద్ జిలాని, ఆరోగ్య కార్యదర్శులు జగదీశ్వరి, విజయలక్ష్మి, శంకరమ్మ, హేమలత, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పుష్ప పల్లకిపై రేణుకా యల్లమ్మ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ములకలచెరువు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళచెరువు పంచాయతీ ఎర్రంరెడ్డిగారిపల్లెలో బుధవారం రేణుకా యల్లమ్మ అమ్మవారు పుష్పపల్లకిపై ఊరేగారు. అరటిమాను ఎక్కుట, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బళ్లారి డప్పులు, పండరి భజనలు, కోలాటాలు బాణసంచా పేలుళ్ల మధ్య అమ్మవారిని ఎర్రంరెడ్డిగారిపల్లె, మావిళ్ళవారిపల్లెల్లో వైభవంగా ఊరేగిం చారు.

ఈవోపీఆర్‌డీ చలపతిరావుకు సన్మానం


చలపతిరావును సన్మానిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కుల మత రాజకీయాలకు అతీతంగా నిబద్ధతతో పని చేసిన వ్యక్తి ఈవోపీఆర్‌డీ చలపతి రావు అని డీఎల్‌పీవో నాగరాజ, ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, ఇతర మండలాల ఎంపీడీవోలు తెలిపారు. బుధవారం స్థానిక ఎన్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో చలపతి రావు పదవీ విరమణ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు, కార్యదర్శులు ఇతర మండల స్థాయి అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన శేష జీవితం సుఖంగా గడపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, డీఎల్‌డీవో లక్ష్మీపతి, ఏవో రమేష్, కార్యదర్శులు వెంకటరమణ, మారెప్ప, గాయత్రి, గౌతమి, శ్రీకాంత్, సరస్వతి, రాజేష్, నాయకులు రెడ్డెప్పరెడ్డి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కోదండరామాలయ బ్రహ్మోత్సవాలు

కురబలకోట, ఏప్రిల్ 2: మండల కేంద్రంలో శుక్రవారం నుంచి కోదండరామాలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో మంజుల తెలిపారు. 4వ తేదీన అంకురార్పణ, 5న ధ్వజారోహణం, హనుమంతవాహనం, 6న సింహవాహనం, 7న శేష వాహనము, 8న సూర్యప్రభ, 9న మోహిని ఉత్సవం, గజవాహనం, 10న కల్యాణోత్సవం, గరుడోత్సవం, 11న బ్రహ్మ రథోత్సవం, 12న అశ్వ వాహనం, 12న వసంతోత్సవం, హంసవాహనం, 14న శయనోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని భక్తులను కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రామసముద్రం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం కాప్పల్లి గ్రామ పంచాయతీ గజ్జులవారిపల్లె సమీపంలో బుధవారం కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో చెంబకూరుకు చెందిన ద్విచక్ర వాహనదారుడు మునివెంకటప్ప తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నేడు గంగమ్మ జాతర

రాజంపేట టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతర గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం అమ్మవారికి వేప ఆకుల మండపాన్ని నిర్మించారు. అలాగే భక్తులు ఇబ్బంది పడకుండా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కడప జిల్లాలో రాజంపేట గంగమ్మతల్లి జాతరకు అత్యంత ప్రాముఖ్యత ఉండటంతో పట్టణ, మన్నూరు సీఐలు రాజా, కుళాయప్ప, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు ప్రసా ద్‌రెడ్డి, నవీన్, మహేష్‌నాయుడు, రవిప్ర కాష్‌రెడ్డి నేతృత్వంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

మురుగు పారే దారేది..?


జహా నగర్ నుంచి జాతీయరహదారిలోకి వెళ్లే దారిలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

- ఏ గ్రేడ్ మున్సిపాలిటీలో దుస్థితిలో మురుగు కాలువలు
- నిధులు మంజూరైనా.. పనిచేసే వారేరీ?

అన్నమయ్య జిల్లాలోనే అతిపెద్ద మున్సిపాలిటీ . రూ.90 కోట్ల వార్షిక బడ్జెట్, అవసరమైన మేరకు ఇంజినీరింగ్ సిబ్బంది, అన్నీ ఉన్నా పదేళ్లుగా మదనపల్లె మున్సిపాలిటీలోని కొన్ని ప్రాంతాల్లో మురుగు కాలువలు నిర్మించలేని పరిస్థితి. ఇష్టారాజ్యంగా సీసీ రోడ్లు నిర్మించేశారు కానీ, మురుగు నిర్మాణాలను విస్మరించారు. దీంతో ప్రజలు మురుగునీటిలో నుంచే నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది.


గురుకుల పాఠశాలకు వెళ్లే దారిలో..

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):మదనపల్లె పట్టణంలో 35 వార్డులు వుండగా, 1, 2, 3, 12, 24, 25 వార్డులు స్లమ్ ఏరియాల్లో విస్తరించి వున్నాయి. ఈ వార్డుల్లో అంతంత మాత్రమే సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టగా మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టలేదు. పట్టణంలోని ధనికులు నివశించే ప్రాంతాల్లో మాత్రం రూ.కోట్లు వెచ్చించి సకల సౌకర్యాలు కల్పిస్తున్నారే కాని, స్లమ్ ఏరియాలో మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా వివక్ష చూపుతున్నారు. ముఖ్యంగా 1, 2 వార్డులు విస్తరించిన అమ్మచెరువుమిట్ట, అనపగుట్ట, శ్రీవారి నగర్, చంద్రాకాలని, అంబేడ్కర్ గురుకులం పాఠశాల, చౌడేశ్వరి సర్కిల్ నుంచి నీరుగట్టువారిపల్లె వెళ్లే జాతీయ రహదారి పక్కన మురుగునీటి కాలువలు నిర్మించలేదు. చంద్రాకాలనిలో అయితే గత పదేళ్లుగా కాలువలు లేక ప్రజలు ఇళ్లలోని మురుగునీరు వీధుల్లోనే వదిలేస్తున్నారు. పిల్లలు, వృద్ధులు మురుగునీటిని తొక్కుకుంటూనే నడవాల్సిన దుస్థితి నెలకొంది.

పనులు చేసే వారేరీ?

మదనపల్లె మున్సిపల్ జనరల్ నిధుల నుంచి మురుగునీటి కాలువలు, కాలువలపై చిన్నసైజు బ్రిడ్జిలు, సీసీరోడ్లు నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నా, దానికి కౌన్సిల్ అమోదం తెలిపినా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ విషయమై గత మున్సిపల్ కౌన్సిల్‌లో మెజారిటీ కౌన్సిలర్లు ధ్వజమెత్తి, చైర్‌పర్సన్ పోడియం ఎదుట బైఠాయించి నిరసనలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు, ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టు పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లను బతిమాలుతున్నా పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీనిపై అధికారులు, కౌన్సిలర్లు ప్రత్యేకంగా సమావేశమై అభివృద్ధి పనులు చేపట్టడంలో ప్రాంతాల మధ్య వివక్ష లేకుండా, మంజూరైన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు నిర్ణయాలు తీసుకోవాల్సి వుంది.

వక్ఫ్ సవరణ బిల్లు అనైతికం

- కేంద్ర ప్రభుత్వ తీరుపై ముస్లింల నిరసన


వాల్మీకిపురం గాంధీ బస్టాండ్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

వాల్మీకిపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తీసుకురావడంపై బుధవారం వాల్మీకిపురంలో నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని ముస్లింలు స్థానిక గాంధీ బస్టాండ్ సర్కిల్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మత పెద్దలు మాట్లాడుతూ పార్లమెంట్‌లో పూర్తి చట్టం తరువాత కార్యాచరణ తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీలకు అతీతంగా మత పెద్దలు, ముస్లిం నాయకులు, యువత పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్ :దేశ వ్యాప్తంగా ముస్లింలు వ్యతిరేకిస్తున్నా పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టడం అనైతికం అని కాంగ్రెస్ పార్టీ నేత రెడ్డి సాహెబ్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే బాషా అన్నారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుకు టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం ముస్లిం సమాజానికి ద్రోహం చేసినట్లేనన్నారు. ఇప్పటికైనా టీడీపీ, జనసేన పార్టీలు బిల్లును వ్యతిరేకించి ముస్లింలకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముస్లింల ఆర్థిక స్థితిని దెబ్బకొట్టడానికే వక్ఫ్ బిల్లును తెచ్చారని బీజేపీపై విమర్శలు కురిపించారు. ముస్లింలపై బీజేపీ కక్ష సాధిస్తోందని ఆరోపించారు. ఓటు రాజకీయాల కోసం ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహమ్మద్‌పీర్, మహమ్మద్ అలీ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

నీటి వసతి ఉన్న చోటే తొట్టెలు నిర్మించాలి


నీటి తొట్టెల పనులను ప్రారంభిస్తున్న ఉపాధి పీడీ వెంకటరత్నం

నిమ్మనపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నీటి వసతి ఉన్న చోటే పశువుల తొట్టె లను నిర్మించాలని అన్నమయ్య జిల్లా ఉపాధి పీడీ వెంకటరత్నం తెలిపారు. బుధవారం మండలంలోని కొండయ్య గారి పల్లి పంచాయతీ అంబేద్కర్ కాల నీలో నీటితొట్టెల నిర్మాణాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ జిల్లా వ్యాప్తంగా 1100వందల నీటి తొట్టెలు నిర్మించనున్నట్లు తెలిపారు. తొట్టెల నిర్మాణం పూర్తయిన తరువాత తప్పని సరిగా నీటితో నింపాలని తెలిపారు. గొర్రెలు, మేకలకు మరో డిజైన్‌తో తొట్టెలు నిర్మించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఏపీవో రమేష్, మాజీ సర్పంచ్ రఫీ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: మండలంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఏపీవో అంజినప్ప మాట్లాడుతూ..పశువులు, మేకలు, గొర్రెలు, మూగజీవాలకు నీటి కోసం గ్రామాల్లో అనువైన చోట 5200 లీటర్ల సామర్థ్యంతో నీటి తొట్టెలు నిర్మించుకోవాలన్నారు. మండలానికి 42 నీటి తొట్టెలు మంజూరయ్యాయన్నారు. ఒక్కో నీటి తొట్టె నిర్మాణానికి ఎన్ఆర్ ఈజీఎస్ ద్వారా రూ.33వేలు ప్రభుత్వం అందచేస్తుందని తెలిపారు.

స్వార్థ రాజకీయాలతో మాల, మాదిగలను విడగొట్టారు


యమలా సుదర్శనంకు సన్మానం చేస్తున్న మాల మహానాడు నాయకులు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అగ్రకులాలు రాజకీయ స్వార్థంతోనే మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టారని మండల మాల మహానాడు అధ్యక్షుడు వీరనాల మాణిక్యం అన్నారు. బుధవారం స్థానిక కూడలిలో వున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం వారపు సంతలో ఏర్పాటు చేసిన వేదికపై అంబేడ్కర్ సేవా గ్రహీత యమల సుదర్శనంకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత యమల సుదర్శనం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం బాధాకరమన్నారు. మాలలు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహర్, జగదీష్, యర్రయ్య, శ్రీరాములు, రమణ, భరత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర రిబ్బన్లతో ఎన్‌ఎంయూఏ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్‌ఎంయూఏ నేతలు

పీలేరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీలేరులోని ఎన్‌ఎంయూఏ నేతలు బుధవారం ఉదయం ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూఏ జిల్లా కార్యదర్శి పీఎస్‌ఎం రాజు మాట్లాడుతూ సర్క్యులర్ నెం.1/2019ను కచ్చితంగా అమలు చేయాలని, నైట్ అవుట్ అలవెన్సులను రూ.400లు చేయాలని, హయ్యర్ పెన్షన్ సమస్యలను పరిష్కరించాలన్నారు. లీవు ఎన్‌క్యాష్‌మెంట్ వెంటనే మంజూరు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనాలని, ఈహెచ్ఎస్ విధానానికి బదులుగా పాత వైద్య విధానం అమలు చేయాలన్నారు. వీపీ నాయుడు, సీవీ రమణ, ఆదినారాయణ, హరినాథ్ పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయండి

వాల్మీకిపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భారతీయ జ నతా పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి నరేంద్ర కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వాల్మీకిపురం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మండల పార్టీ అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. మండల పార్టీ ఉపా. ధ్యక్షుడుగా గోవింద రాజులు, రాజారెడ్డి, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులుగా కృష్ణచైతన్య, మారుతిరెడ్డి, కార్యదర్శులుగా మాధవరెడ్డి, సుధీర్, ప్రసాద్, కోశాధి కారిగా నవీన్‌కుమార్, సోషల్ మీడియా కన్వీనర్‌గా రెడ్డిశేఖర్‌లను ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేశారు.

బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక

నిమ్మనపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో పార్టీని విస్తరింప చేయడానికి మండల కార్యవర్గాన్ని ఎన్నుకొన్నట్లు అన్నమయ్య జిల్లా బీజేపీ జాయింట్ సెక్రెటరీ ఆకుల కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక బస్టాండులో మండల బీజేపీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సునీల్‌రెడ్డి, ఆరుగురు ఉపా. ధ్యక్షులు, ఇద్దరు జనరల్ సెక్రెటరీలు, ఆరుగురు సెక్రెటరీలు. 1ట్రెజరర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మదనపల్లి అసెంబ్లీ కన్వీనర్ భగవాన్, శ్రీరాములు మదనమోహన్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కూలీలు జాగ్రత్తలు పాటించాలి


కార్మికులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు అందజేస్తున్న కార్మిక సంక్షేమ శాఖ అధికారి ఆనంద బాబు

పీలేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని కార్మిక సంక్షేమ శాఖాధికారి ఆనందబాబు సూచించారు. బుధవారం ఆయన పీలేరులో భవన నిర్మాణ కార్మికులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పలు చోట్ల చలివేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశాల్లో తాగునీటి వసతి ఏర్పాటు చేసుకోవాలన్నారు. మధ్యాహ్న సమయాల్లో కాసింత ఎక్కువ సేపు విశ్రాంతి తీసుకోవాలన్నారు. భవనాల యజమానులు, మేస్త్రీలు తగిన ఉపశమన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిం చారు. లేబర్ కార్డులు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలరాం, ప్రభాకర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం..

వాల్మీకిపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని వాల్మీకిపురం మండల టీడీపీ సీనియర్ నాయకుడు కంభం నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందన్నారు. పట్టణ సమీపంలోని మదనపల్లె మార్గంలో అసంపూర్తిగా ఉన్న సబ్‌జైలు, అగ్నిమాపక కేంద్రం భవనాల చివరి దశ పనులకు గాను రూ.3.5 కోట్లు, దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు రూ.1.5కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవతో వాల్మీకిపురం అభివృద్ధికి కృషి చేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, నాయకులు పీవీ నారాయణ, శేషాద్రిరెడ్డి, కేకేనాయుడు, రాజగోపాల్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలి


చెత్త సేకరణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అబ్దుల్‌రహీం

కలకడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):పంచాయతీలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించాలని ఎంపీడీవో అబ్దుల్ రహీం సిబ్బందికి సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం కలకడలో ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్, కార్యదర్శి దేవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పీలేరు ఈవోపీఆర్‌డీ లతీఫ్ ఖాన్ తెలిపారు. గ్రామ పంచాయతీల్లో ఘన వ్యర్థాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, క్లాప్ మిత్రలకు బుధవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంపై ప్రజలు, దుకాణదారులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్ మధు పథకం లక్ష్యాలు, పాటించాల్సిన విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఈవో గురుమోహన్, కార్యదర్శులు జ్ఞానశేఖర్, బావాజాన్, సంయుక్త, హరిప్రసాద్ నాయుడు, శివాజీ, అయ్యప్ప, సిద్దయ్య, ఫరూఖ్, గుణశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: గ్రామాలను పరిశుభ్రంగా తీర్చి దిద్దే విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని ఈవోఆర్డీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం వాల్మీకిపురంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో కార్యదర్శులు, కార్మికులు కలిసికట్టుగా పంచాయతీలను పరిశుభ్ర పంచాయతీలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం పంచాయతీ ఈవో రవీంద్రనాథ్ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త తయారీ, చెత్త నుంచి సంపద తయారు చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ లతీఫ్ ఖాన్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, కార్మికులు

కలకడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల కోసం సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతగా బుధవారం కోనలో టీడీపీ నాయకులు, చేనేత కార్మికులు ఆయన చిత్ర పటాన్ని పాలతో అభిషేకించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు కుమారి మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇవ్వడం హర్షణీయమన్నారు. ఇందుకు సంబంధించిన జీవో విడుదల చేయడంతో సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు బాలయ్య, గురుస్వామి, రెడ్డప్ప, హరీష్, రెడ్డెమ్మ, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీలను నియమించాలి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ సెల్ పోలీస్‌స్టేషన్లలో డీఎస్పీలను నియమించాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024లో 98 మంది ఎస్సీ, ఎస్టీ స్పెషల్ పోలీస్ స్టేషన్లలోని డీఎస్పీల పోస్టులను రద్దు చేశారని ఆరోపించారు. కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తరువాత కూడా ఈ విషయంపై స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితను కలిసి ఈ విషయం విన్నవించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు, కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో ఏప్రిల్ చివరి వారంలో విజయవాడ నడిబొడ్డున మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గిన్నెల మనోహర్‌రెడ్డి, జిల్లా నాయకులు హరిబాబు, రూపక్‌నాయక్, రాఘవేంద్రయాదవ్, నాయకురాలు మేరీ, లారా, రెడ్డిశేఖర్, భానుప్రకాష్, అలీ, వెంకటేష్, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో బుధవారం ఆటిజంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్‌ఎం సుబ్బారెడ్డి తెలిపారు. అనంతరం ఆటిజం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ నాగేంద్ర, రెడ్డెమ్మ, కేర్ టేకర్ రెడ్డిరాణి, రామచంద్ర, భవిత కేంద్రంలోని పిల్లలు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


నినాదాలు చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

మదనపల్లె అర్బన్ ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పని చేస్తున్నా తమ జీవితంలో ఎదుగుబొదుగు లేక ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలు పరిష్కరించాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు పంపడానికి పంచాయతీ కార్మికులు వినతి పత్రాలు సిద్ధం చేశారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట వాటిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వెంటనే పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రమీలమ్మ, శ్యామలమ్మ, జిల్లా కమిటీ సభ్యులు గోపాలు, రవి, నాగరాజు, అంజమ్మ, రమణమ్మ, గంగులమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాలువపల్లె పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థులకు నగదు బహుమతి అందించిన నాగమోహన్‌రెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఉపాధ్యాయుడు నాగ మోహన్ రెడ్డి, నవీన కుమారి దంప తులు పాఠశాలకు ఒక్క రోజు కూడా గైర్హాజరుకాని 16 మంది విద్యార్థులకు ఒకొక్కరికి రూ.516 చొప్పున మొత్తం రూ.8,256లు అందజేశారు. ఈ నగదును ఎంఈవోలు వెంకటరమణ, శంకరయ్య విద్యా ర్థులకు పంపిణీ చేశారు. బయాలజీ టీచర్ రెడ్డెప్పను పదవీ విరమణ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ అంజి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన పర్వీన్‌తాజ్


చంద్రబాబుతో మాట్లాడుతున్న పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ పర్వీన్‌తాజ్ బుధవారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబును కలిశారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించిన పలు విష యాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై పార్టీ విధానాన్ని, పార్లమెంటులో పార్టీ వాణిని ప్రజలకు అర్థం అయ్యేలా వివరించాలని సూచించినట్టు ఆమె వివరించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


గురువులతో 1974-75 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పీలేరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాల అనంతరం నిర్వహించిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు పీలేరులోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలు వేదికైంది. పీలేరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974-75 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థుల కలయిక బుధవారం జరిగింది. ఆ బ్యాచులోని చాలా మంది వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసి పదవీ విరమణ చేశారు. ప్రస్తుత వయసుతో నిమిత్తం లేకుండా విద్యార్థి దశలో తాము చేసిన అల్లరి, ఇతర జ్ఞాపకాలను పరస్పరం పంచు కున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్, మౌలిక వసతుల కల్పన, ప్రతి ఏటా పూర్వ విద్యార్థుల కలయిక, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు, విశ్రాంత ఎంఈవో రెడ్డిసుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం వంగిమళ్ల రామచంద్ర, విశ్రాంత డీఎఫ్‌వో కృష్ణయ్య రమణ, ఎర్రయ్య శెట్టి, శంకర్ రాజు, డా.రవిశంకర్ రెడ్డి, సత్తార్ బేగ్ పాల్గొన్నారు